నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
వరంగల్
గురువారం మార్చి 27, 2025

మున్సిపాలిటీ నుంచి తండాలను తొలగించాలి

వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారిపై ధర్నా

నవతెలంగాణ-వర్ధన్నపేట



మున్సిపాలిటీ పరిధిలోని తండావాసులు తమ తండాలను మున్సిపాలిటీ నుంచి తొలగించి ప్రత్యేక జీపీలుగా ఏర్పాటు చేయాలని మున్సిపాలిటీ పరిధిలోని డీసీతండావాసులు బుధవారం వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. వర్ధన్నపేట మున్సిపాలిటీలోని విలీన గ్రామాలైన తండాలను మున్సిపాలిటీ నుంచి తొలగించాలని, జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. తండాలను మున్సిపాలిటీలో విలీనం చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రెండేండ్లుగా ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి తండాలను యథావిధిగా గ్రామపంచాయతీలు ఏర్పాటు చేయాలని మున్సిపాలిటీ నుంచి తక్షణమే తొలగించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

ఏరియా ఆసుపత్రిలో 'కాయకల్ప' పై పరిశీలన

నవతెలంగాణ-వర్ధన్నపేట



వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రిలో కాయకల్ప కార్యక్ర మంలో భాగంగా పెద్దపల్లి వైద్య బృందం వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించింది. వివిధ అంశాలపై ఆసుపత్రిని పరిశీలించారు, కేంద్ర ప్రభుత్వం ఆసుపత్రుల్లో ఉత్తమ సౌక ర్యాలు కల్పించిన వాటిలో రాష్ట్రంలో మూడు ఆసుపత్రులను ఎంపిక చేసి మొదటి బహుమతి రూ.25లక్షలు అందించనున్నారు. మొదటి, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులు ఉంటాయని పేర్కొంది. కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా నుంచి సూపరిండెంట్ డాక్టర్ రాజశేఖర్ వారి బృందం వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రిని బుధవారం సందర్శించి ఆసుపత్రిలో అందుతున్న సేవలు సౌకర్యాలపై పరిశీలించారు ల్యాబ్ వార్డులు పరిశుభ్రత ఆసుపత్రి సిబ్బంది ఓపి విభాగం 8అంశాలపై పరిశీలించారు. రాజశేఖర్ బృందం వైద్యులను పలు సౌకర్యాలపై అభినందించారు.కార్యక్రమంలో స్థానిక సూపర్డెంట్ డాక్టర్ రామ్మూర్తి ఆర్ ఎం ఓ డాక్టర్ విజయ్ కుమార్ భాస్కర్ ఇతర డాక్టర్ లు నర్సులు సిబ్బంది పాల్గొన్నారు.



స్త్రీ నిధిలో వరంగల్ జిల్లా నెంబర్ వన్

సెర్ప్- స్త్రీ నిధి సిబ్బంది పనితీరు అభినందనీయం

డిఆర్డిఓ కౌసల్యాదేవిని ప్రశంసించిన మంత్రి సీతక్క,సీఈఓ దివ్య

నవతెలంగాణ-వరంగల్

రాష్ట్ర ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసి వరంగల్ జిల్లాను తెలంగాణ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలుపుటకు అత్యంత ప్రతిభ కనబరిచిన వరంగల్ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి కౌసల్యాదేవిని పిఆర్ అండ్ ఆర్డి మంత్రి ధనసరి అనసూయ సీతక్క అభినందించారు. బుధవారం హైదరాబాద్ నిర్వహించిన స్త్రీనిధి రాష్ట్రస్థాయి జనరల్ బాడీ సమావేశంలో మంత్రి సీతక్క ముఖ్యంగా పాల్గొని అత్యంత ప్రతిభను కనబడుచుటకు కృషిచేసిన జిల్లాల అధికారులకు, ప్రతినిధులకు ప్రతిభ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా స్త్రీ నిధి రుణాల పంపిణీ, అప్పు తిరిగి చెల్లింపులలో రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా నిలిచిన వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్డిఓ కౌసల్యాదేవిలతో పాటు సెర్ప్- స్త్రీ నిధి సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామీణ పేద మహి ళలను ఆర్థిక సామాజిక రంగాలలో అభివృద్ధి పరుచుటకు సెర్ప్ గ్రామైక్య సంఘాల ప్రతినిధులు సిబ్బందితో సాధ్యమవుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతి ప్రభుత్వం అని, అందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళా సంక్షేమ అభివృద్ధి కోసం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలు నిదర్శనమని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే మొట్టమొదటిసారిగా ఇందిరా మహిళశక్తి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సెర్ప్ సీఈవో దివ్య రంగరాజన్, స్త్రీ నిధి మేనేజింగ్ డైరెక్టర్, వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, అడిషనల్ డిఆర్డిఓ రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

కేంద్ర ఖాదీ బోర్డు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం

నవతెలంగాణ-వర్ధన్నపేట

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. బుధవారం వర్ధన్నపేట పట్టణంలోనిఆల్ ఫోర్స్ చైతన్య కళా సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో పర్యావరణం పరిరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ విజయసాగర్‌తో కలిసి మల్లేశం పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచి ఇంటి వద్ద 5మొక్కలు తప్పనిసరి నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమీషనర్ ఇమ్మడి సుధీర్ కుమార్, ఎస్సై భూక్యా చందర్, గ్రేటర్ వరంగల్ మాజీ డిప్యూటీ మేయర్ కక్కె సారయ్య మల్లిఖార్జునస్వామి, దేవస్థానం మాజీ చైర్మన్ సిలువేరు కుమారస్వామి, ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ సునీల్ కుమార్, ఆల్ ఫోర్స్ పాఠశాల ప్రిన్సిపల్ సింహాద్రి, అర బిందో పాఠశాల చైర్మన్ దిలీప్‌సింగ్, చైతన్య కళా సంస్థ సభ్యులు వల్లందాస్ లక్ష్మణ్, కరిమిల్ల సంపత్‌రావు, భూషబోయిన సంపత్‌యాదవ్, ప్రభాకర్, ప్రవీణ్, విక్రమ్, కుమారస్వామి, రాజు, కుమార్, శివ, కనకయ్య, రమేష్, చిట్టి, చందు తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతన్నకు శాపంలా...

తేనేమంచు తెగులు

తగ్గనున్న దిగుబడులతో రైతన్నల దిగాలు

రెండేళ్లుగా తగ్గుతున్న దిగుబడులు

ఎగుమతులపై ఎఫెక్ట్..

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



ఉమ్మడి వరంగల్ జిల్లాలో మామిడి దిగుబడులు రెండేండ్లుగా తగ్గుతూ వస్తున్నాయి. ఏడాది సైతం 60-70 శాతం దిగుబడులు తగ్గను న్నాయి. తేనేమంచు తెగులుతో మామిడి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎకరాకు 3-4 మెట్రిక్ టన్నుల దిగుబడి రావాల్సి వుండగా, ఈ సీజన్‌లో ఎకరాకు 1-2 మెట్రిక్ టన్నుల కంటే దిగుబడి మించే అవకాశం కనిపించడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్, జనవరి మాసాల్లో తేనేమంచు తెగులు సోకడం మామిడి రైతుకు శాపంగా పరిణమించింది. డిసెంబర్ పొగమంచు వల్ల కూడా పూత గణనీయంగా రాలిపోయింది.

భారీగా తగ్గనున్న దిగుబడులు

ఈ ఏడాది మార్చి 24వ తేదీనాటికి 168 క్వింటాళ్ల మామిడి మాత్రమే మార్కెట్‌కు రావడం గమనార్హం. ఏప్రిల్, మే మాసాల్లోనే మామిడి దిగు బడులు పెద్ద మొత్తంలో మార్కెట్‌ను ముంచె త్తుతాయి. రైతులు 'నవతెలంగాణ'కు తెలిపిన క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి దిగు బడులు గణనీయంగా తగ్గే ప్రమాదం కనిపిస్తుంది.

ఉత్తర భారతానికి వరంగల్ మామిడి ఎగుమతి

వరంగల్ మార్కెట్ నుండి మామిడి పండ్లను ఉత్తర భారత దేశానికి పెద్ద ఎత్తున ఎగుమతి అవుతాయి. వరంగల్ పండ్ల మార్కెట్‌లో ఏప్రిల్ 10వ తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు మామిడి పండ్ల సీజన్ వుంటుంది. ఈ సీజన్‌లో వరంగల్ మార్కెట్ నుండి ఉత్తర్‌ప్రదేశ్, జమ్మూ, కాశ్మీర్, రాజస్థాన్,పంజాబ్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, నాగాలాండ్, నేపాల్ దేశానికి సైతం వరంగల్ మామిడి ఎగుమతి అవుతుంది. కానీ దిగుబడులు రాకపోవడంతో ఎగుమతులపై ప్రభావం పడనుంది.

ఉమ్మడి వరంగల్‌లో 38వేల ఎకరాల తోటలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 38వేల ఎకరాల మేరకు మామిడి తోటలు సాగువుతున్నాయి. ఇందులో మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా 14వేల52ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. జనగామ జిల్లాలో 8,886 ఎకరాలు, వరంగల్‌లో 6,727, హన్మకొండ జిల్లాలో 6,075, భూపాలపల్లి జిల్లాలో 1,566, ములుగు జిల్లాలో 454ఎకరాల్లో మామిడిని తోటలున్నాయి.మామిడిలో ప్రధానంగా జిల్లాలో బంగినిపల్లి రకం మామిడినే రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. 99శాతం బంగినిపల్లి రకాలే రైతులు సాగు చేస్తుండడం గమనార్హం. ఇవే కాకుండా తోతాపూరి, నీలం, చిన్న రసాలు, పెద్ద రసాలు, దశేరి, కేసరి, చెరుకురసం, జలాలు (పచ్చడి మామిడి) తదితర రకాల తోటలు జిల్లాలో వున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి చీడ, పీడలు ఆశించడంతో దిగుబడిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నిండా మునిగాం



ఈ ఏడాది మామిడి దిగుబడి రాక నిండా మునిగాం. 80ఎకరాల మామిడి తోటలు కౌలుకు తీసుకున్న. తేనేమంచు తెగులుతో పూత నల్లగా మారి రాలిపోయింది. కొన్ని చెట్లకు పిందె వచ్చినా మాడిపోయాయి. పైరగాలి రావడంతో పూత, కాత రాలిపోయి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. డిసెంబర్, జనవరి మాసాల్లో తేనెమంచు పురుగు ఉధృతితో పంట దెబ్బతింది. గత ఏడాది 80 ఎకరాల పేరిట 100 మెట్రిక్ టన్నుల మామిడిని మార్కెట్‌కు తరలించినా, ఈసారి 30-35 మెట్రిక్ టన్నుల దిగుబడి కూడా వచ్చేట్టు లేదు. 80ఎకరాలను రూ.18లక్షలు కౌలుకు తీసుకుంటే ఇప్పటికే రూ.10-రూ.12 లక్షల పెట్టుబడి పెట్టినా, కౌలుకు సంబంధించి రూ.7లక్షలు ఇప్పటికే చెల్లించా.. కాయలు తెంపే దశలో మిగతా డబ్బు చెల్లంచాల్సి వుంది. 80ఎకరాల్లో 20ఎకరాల్లో కనీసం 10శాతం కూడా దిగుబడి లేదు. ఈసారి తీవ్ర నష్టం తప్పదు. మూడేళ్లపాటు లీజ్ తీసుకొని తోటలు పడుతం. పెట్టుబడి కూడా దక్కేట్టు లేదు.

నీరటి సమ్మయ్య, దమ్మన్నపేట (వర్ధన్నపేట)



దళితవాడలో రోడ్లు, డ్రైనేజీని నిర్మించాలి

సీపీఐ(ఎం) ఖిలా వరంగల్ మండల కార్యదర్శి రత్నమాల

నవతెలంగాణ-కాశిబుగ్గ

ఖిలా వరంగల్‌లోని దళితవాడలో సిసి రోడ్లు డ్రైనేజీని వెంటనే నిర్మించాలని సీపీఐ(ఎం) ఖిలా వరంగల్ మండల కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ నలిగంటి రత్నమల అన్నారు. బుధవారం ఖిలా వరంగల్ పడమర కోటలో కొంపెల్లి అనిత అధ్యక్షతన దళితవాడలోని సమస్యలపై ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ నలిగంటి రత్నమాల మాట్లాడుతూ ఖిల వరంగల్ పడమర కోటలోని దళిత వాడలో తీవ్రమైన సమస్యలు నెలకొన్నాయని,దళిత వాడలో తాము సర్వే నిర్వహించగా కిందివాడలకు తాగునీరు రావడంలేదని, మెయిన్ రోడ్డు బొందలుగా ఏర్పడి రోడ్డుపై తిరిగే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నాయని అన్నారు. గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. డ్రైనేజీ కాలువల నిర్మాణం లేకపోవడం వల్ల మురుగునీరు రోడ్లపైనే పారడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖిలా వరంగల్ దళిత కాలనీలో తాను కార్పొరేటర్‌గా ఉన్నప్పుడు సుమారు 25 ఏండ్ల క్రితం వేసిన రోడ్లు ఉన్నాయని కొత్తగా సిసి రోడ్లు వేయడానికి ఎవరికీ చిత్తశుద్ధి లేదన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే నాయకులు ప్రజలకు అనేక హామీలు ఇస్తున్నారని, అనంతరం ప్రజలకు ముఖం కూడా చూపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు దళిత వాడలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని లేనియెడల మున్సిపల్ కార్పొరేషన్ ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు భవాని, ప్రజాసంఘం నాయకులు నళిగంటి పాల్, గుండేటి అనిల్, గొర్రె ప్రవీణ్, సుమన్, అశోక్, సరోజన,, కమలమ్మ, శ్రావణి, బుజ్జక్క ఎల్లయ్య, చిన్ను పాల్గొన్నారు.



దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే విరాళం

-విరాళం అందజేసిన పిన్నింటి అనిల్‌రావు

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని వడ్లకొండలో శ్రీరంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణం కోసం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు తమవంతు విరాళంగా రూ.1,01,116 నగదు రూపకంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్‌రావు వడ్లకొండలో నూతనంగా నిర్మాణం చేసిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో వడ్లకొండ మాజీ సర్పంచ్ ఆమడగాని రాజుయాదవ్, మాజీ ఎంపీటీసీ అత్తి రేవతి కుమార్ ఆధ్వర్యంలో దేవస్థానం నిర్మాణం కమిటీ సభ్యులకు ఆయన అందచేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాణం కమిటీ సభ్యులు బోయినపల్లి స్వామిరావు, కరిమిళ్ల దేవేందర్‌రావు, చందసాని సమ్మయ్య జుట్టుకొండ రమేష్, జుట్టుకొండ రాజు, తక్కళ్లపెల్లి సంపత్‌రావు, వల్లందాసు రంగయ్య మాజీ ఎంపీపీ, కరిమిళ్ల దుర్గారావు, దాడి లింగయ్య, బైరి ఎల్లయ్య దాడి సదానందం, కోదాటి కుమార్ రావు, జుట్టుకొండ నాగయ్య, కట్ట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

నవతెలంగాణ -నర్సంపేట

పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని పాస్టర్ ఎం.ఆదామ్ బెన్నీ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో పాస్టర్స్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షులు పాస్టర్ లాజరు అధ్యక్షతన పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మృతిపై సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదామ్ బెన్నీ మాట్లాడుతూ ఈ నెల 25న రాజమండ్రి ప్రాంతంలో దైవజనులు పగడాల ప్రవీణ్‌కుమార్ మరణం రెండు తెలుగు రాష్ట్రాల క్రైస్తవులకు తీరని లోటని, వారు గొప్ప మానవతావాది సంఘసంస్కర్త అని కొనియాడారు. క్రైస్తవుల పక్షాన ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాస్టర్‌లు మాట్లాడుతూ ప్రవీణ్‌కుమార్ మృతిపై యావత్తు క్రైస్తవ లోకానికి అనేక అనుమానాలు ఉన్నాయని, ఈఘటనపై సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఆయా ప్రాంతాలలో సేవ చేస్తున్న పాస్టర్స్ అందరికీ ప్రభుత్వం తగు భద్రతను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ రేజి జార్జి, ఆర్ మత్తయి, బోడ రవికుమార్, చిన్నపెల్లి శ్రీధర్, యు. పాల్, సీహెచ్ క్రాంతి పాల్, ఎం. పాల్, జీ. శ్రీనివాస్, క్రైస్తవ సంఘం నాయకులు మంద ప్రకాష్, మారపల్లి అశోక్, ఎంఎస్, ప్రభాకర్, కొమ్ముల నవీన్, రవి,మాదాసి నవీన్, ఓ.ఈసాక్, 50 మంది పాస్టర్లు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులపై ఫోకస్

నవతెలంగాణ-వరంగల్



నిబంధనల మేరకే ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులు

కలెక్టర్ చొరవతో సమస్యల పరిష్కారానికి కృషి


అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన

అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్

వరంగల్ జిల్లాలో అనధికార క్రమబద్ధీకరణ ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కలిగించడంతో చాలామంది దరఖాస్తులు పరిశీలనకు వచ్చిన సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ జీవోలకు అనుగుణంగా క్రమబద్ధీకరణ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలుస్తుంది. ఈ విషయమై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎల్‌అర్‌ఎస్ చేసుకోవడానికి దరఖాస్తుదారులలో ఏర్పడిన సందేహాలను నివృతి చేయడానికి ప్రత్యేకమైన అవగాహన సదస్సులు చేస్తూ ప్రత్యేకంగా తానే అన్ని విధాలా అధికారులకు సూచనలు ఇస్తూ న్యాయపరమైన వాటికి ఎల్‌ఆర్‌ఎస్ పర్మిషన్ ఇచ్చే క్రమంలో అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఇటీవల కూడా క్షేత్రస్థాయిలో కూడా అధికారులను అప్రమత్తం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఏమైనా అప్పటికీ జిల్లా కలెక్టర్ క్రమబద్ధీకరణ విషయంలో దరఖాసుదారులకు నిష్పక్షపాతంగా తగున్యాయం జరిగేటట్లు పైరవీలకు తావు లేకుండా అధికారులతో సమీక్షిస్తూ లేఅవుట్ ప్లాట్లపై ప్రత్యేక అధికారుల టీంచే వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నట్లు సమాచారం. ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తుదారులకు ప్రభుత్వం నిబంధనలు మేరకే ఎలాంటి పైరవీలకు తావు లేకుండా ఎలాంటి అనుమానాలు తావు లేకుండా సరైన రీతిలో దరఖాస్తుదారులకు త్వరలో ఎల్‌అర్‌ఎస్ విషయమై ఏదో ఒక నిర్ణయాన్ని వెలువరించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకే లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసే విషయంలో సంబంధించిన అధికారులకు మాత్రమే సమీక్ష సమావేశాల్లో పునఃసమీక్ష చేస్తున్నట్లు తెలుస్తుంది.

ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ నియమావళి ప్రకారమే జిల్లాలో క్రమబద్ధీకరణ అనుమతులు జారీ చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనప్పటికీ ఈ విషయమై జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అర్హులైన దరఖాస్తుదారులకు ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులు ఇచ్చేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తుండడం గమనర్హం. గత ప్రభుత్వంలో2020 సంవత్సరంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు అనధికార ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్నటేందుకు ఎల్‌ఆర్‌ఎస్ వేయి రూపాయలతోటి దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. ఐదేళ్ల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈనెల 31వ తారీకు వరకు ఎల్ అర్ ఎస్ చేసుకుంటే 25 శాతం తగ్గింపు లభిస్తుందని ప్రభుత్వం జీవో జారీ చేయడంతో గ్రేటర్‌లో ఉన్న అనధికార ప్లాట్లు యజమానులు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ముందుకు రావడంతో పాటు అనేకమైన సందేహాలను ఛేదించేందుకు కలెక్టర్ సంబంధించిన అధికారులతో సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేసి వాటిని పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తున్నాడంతో చాలా మంది అనధికార ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోవడానికి చాల మంది ఉత్సాహం చూపిస్తు నట్లు తెలుస్తోంది.

ఎల్‌అర్‌ఎస్‌లో 25శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



అనధికార ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోడానికి నిర్ణీత గడువులోగా ఫీజులు చెల్లించేలా చర్యలు చేపడుతున్నాం.జిల్లాలోని జీడబ్ల్యూఎంసీ, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీ లలో ఎల్‌ఆర్‌ఎస్ 2020 స్కీం కింద ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు 41వేల443దరఖాస్తులు రాగా అందులో 18943 మంజూరు చేసి 1081 దరఖా స్తులకు ఫీజు సేకరించి 1081 క్రమ బద్ధీకరణ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. 100శాతం ఎల్‌ఆర్.ఎస్ క్రమబద్ధీకరణ ప్రొసిడింగ్స్ జారీ చేయుటకు చర్యలు తీసుకొంటున్నాం. ఎల్‌ఆ ర్‌ఎస్ చెల్లింపులు, మార్చి 31 లోపు కడితే వచ్చే 25 శాతం రాయితీపై ప్రజలకు వివరించేలా వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పింస్తున్నాం. ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించుకొని 25శాతం రాయితీ పొందాలి.

డాక్టర్ సత్య శారద వరంగల్ జిల్లా కలెక్టర్

ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేయాలి

మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూడాలి

జిల్లా కలెక్టర్ సత్య శారద

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేయాలని, మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం మండలంలో ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించి రామతీర్థం గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి ఇండ్లను త్వరగా పూర్తిచేయాలని లబ్దిదారులకు సూచించారు. ఇంటి నిర్మాణాన్ని బట్టి లబ్ధిదారులకు సకాలంలో దశలవారీగా డబ్బులు అందుతాయని తెలిపారు. మార్చిలోపు బేస్మెంట్ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు లక్ష రూపాయలు వారి ఖాతాలో జమయితాయని అన్నారు. మండలానికి మిషన్‌భగీరథ మంచినీటిని అందించే మండలంలోని నారక్కపేట పంపుహౌస్‌ను పరిశీలించి మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు శుభ్రమైన నీటిని ప్రజలకు అందించాలని కోరారు. పైపులైన్ల లీకేజీల ద్వారా కలుషితం కాకుండా మరమ్మత్తులు వేగవంతంగా చేసి నీటిని వృథా కాకుండా కాపాడాలని సిబ్బందికి తెలిపారు. వేసవిలో మంచినీటి సమస్యలు లేకుండా మిషన్ భగీరథ నీటిని సకాలంలో విడుదల చేయాలని అన్నారు. నీటి సమస్యలు ఉంటే వ్యవసాయ బాగల ద్వారా నీటిని అందించాలని అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహమూర్తి, ఎమ్మార్వో కష్ణ, ఎస్సై గోవర్ధన్, ఏఈ పవిత్ర, ఏపీవో వెంకటనారాయణ, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పర్వతగిరి : ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు ఇండ్లు త్వరగా నిర్మించుకోవాలని జెడ్పీ సీఈవో రాంరెడ్డి సూచించారు. మండలంలోని జమాల్ పురం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు, కమిటీ సభ్యులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడి గణపతి, ఎంపిడిఓ శంకర్ నాయక్, ఎంపీఓ పాక శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి పోశాల దివ్య,ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్దిదారులు, స్థానికులు పాల్గొన్నారు.

నెక్కొండ : ఇందిరమ్మ పథకంలో ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇల్లు పేదలకు నిరుపేదలకు వరమని జిల్లా పరిషత్ సిఈఓ రామ్ రెడ్డి అన్నారు. నెక్కొండ మండలంలోని మోడల్ గ్రామంలో నిర్మాణములోనున్న ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీఓ దయాకర్, మాజీ సర్పంచ్ బానోత్ శ్రీధర్‌తో కలిసి పరిశీలించారు. ముగ్గు పోసుకొని నిర్మాణం చేపట్టి ఇళ్లను పరిశీలించి నిర్మాణాలు చేపట్టుకుంటున్న లబ్ధిదారులతో జెడ్పీసీఈఓ మాట్లాడారు. హౌసింగ్ పీడీ గణపతి ,పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య పాల్గొన్నారు.

బండి రజనీకుమార్‌కు పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

హసన్‌పర్తి బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ తల్లి బండి సారమ్మ బుధవారం మరణించగా పర్వతగిరి మండల బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం బైరాన్‌పల్లిలోని వారి నివాసానికి వెళ్లి సారమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏనుమాముల మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ ఏడుదొడ్ల జితేందర్‌రెడ్డి, మాజీ ఏఎంసి మాజీ డైరెక్టర్ బోయినపల్లి యుగంధర్‌రావు, గనిపాక విజయ్‌కుమార్, రైతు బంధు పర్వతగిరి మండల మాజీ కోఆర్డినేటర్ చిన్నపాక శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

కాశిబుగ్గ : గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్‌కు చెందిన ఉద్యమకారులు హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లిలో సారమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బండి రజనీని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో కేయూ జేఏసీ చైర్మన్ కత్తెరపెల్లి దామోదర్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నేరెళ్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

జ్యూస్ పాయింట్ తొలగించాలని కమిషనర్‌కు వినతి

నవతెలంగాణ-పరకాల



అనుమతి లేకుండా రోడ్డుపై నిర్వహిస్తున్న జ్యూస్ పాయింట్ తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. హుజూరాబాద్ రూట్లో ప్రధాన రహదారి ఆనుకొని ఉన్న జ్యూస్ పాయింట్ యజమాని పలు మల్టిపుల్ వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ఆ దారిలో ప్రయాణించే వాహనదారులు, ఇతరుల షాప్ యజమానులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు శంకర్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే ఆ జ్యూస్ పాయింట్ తొలగించి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలన్నారు. కాగా ఈ విషయంలో ఆటోకార్మికులు ఆందోళనకు సిద్ధం కానున్నట్లు సమాచారం.

బాధితుడికి సెల్‌ఫోన్ అందించిన ఎస్ఐ

నవతెలంగాణ-వేలేరు



వేలేరు మండలంలోని పీచర గ్రామానికి చెందిన జి.నరేష్ తన ఫోన్ పోగొట్టుకున్నారు. జి.నరేష్ వేలేరు పోలీస్‌స్టేషన్‌కి వచ్చి పోలీస్ వారి సహకారంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కంప్లైంట్ చేయగా ఎస్ఐ ఎ.సురేష్ ఆధ్వర్యంలో సీఈఐఆర్ ఆధారంగా ఫోన్‌ను ట్రేస్‌అవుట్ చేసి జి.నరేష్‌కు బుధవారం ఫోన్‌ని అప్పగించారు. పోయిన ఫోన్ మళ్లీ తనకు చేరడంతోఎస్ఐ సురేష్, పోలీసు సిబ్బందికి నరేష్ కృతజ్ఞతలు తెలిపారు.

సరిహద్దు బోర్డుల ఏర్పాటు

నవతెలంగాణ-వేలేరు



పోలీస్ ఉన్నత అధికారుల ఉత్తర్వుల మేరకు వేలేరు ఎస్సై ఏ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం ఉదయం వేలేరుపోలీస్ లిమిట్స్ తెలిపే సైన్ బోర్డు లను వేలేరు పిఎస్ పరిధి ఉన్న ప్రదేశాల్లో పాతడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేలేరు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో



నవతెలంగాణ-దామెర

దామెర మండలంలో జరుగుచున్న ఉపాధి హామీ పనులను బుధవారము ఎంపీడీవో గుమ్మడి కల్పన వివిధ పనులను పరిశీలించారు. ఒగ్లాపూర్ లోని గ్రామ చెరువు పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలతో పని ప్రదేశంలో సౌకర్యాలు, కూలీ రేటు పని వేళల గురించి అడిగి తెలుసుకుని కూలీలకు పలు పనులపై అవగాహన కల్పించారు. మండలంలోని ప్రతి గ్రామంలో 100 మంది ఉపాధి హామీ కూలీలు హాజరయ్యేలా పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రణాళిక తయారు చేసుకొని పనులకు వచ్చేలా చూడాలని తెలిపారు. ఒగ్లాపూర్ లో మంజూరైన పౌల్ట్రీ షెడ్ లబ్ధిదారుడు దుబాసి రాధాకష్ణ 1000 కోళ్ల పెంపకానికి సామర్థ్యం గల షెడ్డు నిర్మిస్తున్న సందర్భంగా నిర్మాణ పనులను ఎంపీడీవో పరిశీలించారు. గ్రామపంచాయతీ వద్దగల నర్సరీని పరిశీలించి మాట్లాడుతూ గ్రామస్తులకు కావాల్సిన మొక్కలను పెంచి వచ్చే వర్షాకాలంలో పంపిణీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శారద, పంచాయతీ కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ నల్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతానికి జనశిక్షణ సంస్థ కృషి




నవతెలంగాణ-నయీంనగర్

అట్టడుగు వర్గాల మహిళలు ఆర్థికంగా ఎదగడానికి జన శిక్షణ సంస్థ కృషి చేస్తుందని సంస్థ వరంగల్ చైర్మన్ ఆర్.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బుధవారం హనుమకొండ అంబేద్కర్‌భవన్‌లో మహిళ పారిశ్రామిక ఉత్పత్తి ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జన శిక్షణ సంస్థన్ వరంగల్ చైర్మన్ ఆర్.ప్రకాష్ గౌడ్ మహిళలు స్వయంగా తయారుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం డైరెక్టర్ ఖజామసీయుద్దీన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ జెఎస్ఎస్ 2008లో ప్రారంభించి 35 వేల మంది మహిళలకు వివిధ రంగాలలో ఉచిత శిక్షణ ఇచ్చి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దామని చెప్పారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. జపాన్ దేశం తరాహలో తెలంగాణలోని ప్రతి ఇల్లు పరిశ్రమ కావాలని అందుకు జన శిక్షణ సంస్థ పూర్తిగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. విశిష్ట అతిథులుగా హాజరైన ఏపీపీసీ డైరెక్టర్ జనరల్ శ్రీనివాస్ రఘు, మినిస్ట్రీ డెవలప్మెంట్ అధికారి సతీష్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నవీన్ మాట్లాడతు మహిళలు మార్కెట్ లో డిమాండ్ ఉన్న వస్తువులను తయారు చేసి స్వశక్తితో ఎదగాలన్నారు. మహిళలకు భవిష్యత్తులో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అనంతరం శిక్షణ తీసుకున్న 600 మంది మహిళలకు అతిధులచే ప్రశంసాపత్రం, శాలువా, మెమెంటో అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రాజు, ప్రముఖ పారిశ్రామికవేత్త, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తుమ్మనపల్లి వీరన్న, జేఎస్ఎస్ మెంబర్స్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బహిరంగ సభకు స్థల పరిశీలన

నవతెలంగాణ-ఎల్కతుర్తి



ఏప్రిల్ 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ సిల్వ ర్‌జూబ్లీ వేడుకలు, అధినేత కేసి ఆర్ బహిరంగ సభాస్థలాన్ని మాజీ ఎ మ్మెల్యేలు వొడితల సతీష్ కుమార్, దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డిలు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులతో అనుమతి పత్రం పొందాలని మండల టిఆర్ఎస్ శ్రేణులకు సూచిం చారు. వారి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, మాజీ వైస్ఎంపీపీ నగేష్, ఎంపీటీసీల మాజీ ఫోరం అధ్యక్షులు కడారి రాజు, పోరెడ్డి రవీందర్ రెడ్డి, ఏల్తూరి స్వామి, గొల్ల మహేందర్, గుండా ప్రతాపరెడ్డి, శేషగిరి, హింగే భాస్కర్, గడ్డంరవి, కోడెరాజకుమార్, ఎండి మదర్, వెంకటేష్ యా దవ్, గోడిశాల శ్రీకాంత్, వినయ్ తదితరులు ఉన్నారు.

డీటీఎఫ్ వేలేరు మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-వేలేరు

వేలేరు మండల డీటీఎఫ్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల సర్వసభ్య సమావేశం బుధవారం వేలేరు జెడ్పీహెచ్ఎస్‌లో డిటిఎఫ్ జిల్లా ఎన్ని కల అధికారి కే.శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వేలేరు మండల డిటిఎఫ్ నూతన అధ్యక్షులుగా జి.శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా బానోతు రవి, జిల్లా కార్యదర్శిగా డి శారదలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రవి మాట్లాడుతూ డీటీఎఫ్ అంటే వృత్తి నిబద్ధత-సామాజిక బాధ్యత అన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ ఉపాధ్యాయులకు పెండింగ్ లో ఉన్న డిఏ,పిఆర్సిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్ర మంలో డీటీఎఫ్ బాధ్యులు కే.మహేందర్‌రెడ్డి, బి.అశోక్, సిహెచ్. దిలీప్, ఎం.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-శాయంపేట



రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు మండల కేంద్రంలో బుధవారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటి వరకు విద్యారంగ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. విద్యరంగానికి ప్రభుత్వం బడ్జెట్లో అతితక్కువ నిధులు కేటాయించి నిర్లక్ష్యానికి గురిచేస్తుందన్నారు. విద్యాశాఖకు వెంటనే మంత్రి కేటాయించి, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

రాష్ట్రంలో రూ. 7200కోట్ల స్కాలర్షిప్స్ ఫీజు రియాంబర్స్మెంట్ పెండింగ్లో ఉన్నాయని పెండింగ్ బకాయిలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎస్ఐ ఆధ్వర్యంలో దర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ఎండీ.ఇస్మాయిల్, నాయకులు సాయికుమార్, అఖిల్, కన్నారావు, శశాంగ్, అజయ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రగతిపథంలో ముందుకు సాగాలి : కలెక్టర్





నవతెలంగాణ-నయీంనగర్

అవకాశాలను అందిపుచ్చుకొని విద్యార్థులు ప్రగతిపథంలో ముందుకు వెళ్లాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పీ.ప్రావీణ్య పేర్కొన్నారు. పింగిళి మహిళా కళాశాలలో 'ఇంటర్ డిసిప్లినరీ మెటీరియల్స్ సైన్స్ ఫర్ సస్టేనబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ (ఎన్సిఐఎంఎస్ఎస్ఈఈ -2025) అనే అంశంపై ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ బి.చంద్రమౌళి అధ్యక్షతన రెండు రోజుల నేషనల్ కాన్ఫరెన్స్ బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రసంగిస్తూ ఆధునిక ప్రపంచంలో సుస్థిరాభివృద్ధి సాధించుటకు వివిధ రకాల శక్తి వనరులను రక్షించుకోవడానికి, పర్యావరణ సమతుల్యతను పెంపొందించాలని, దాని కోసం మెటీరియల్ సైన్స్ దోహద పడుతుందన్నారు. నూతన ఆవిష్కరణలు సజనాత్మక ఆలోచనా విధానాలతో సుస్థిరాభివృద్ధిలో భాగం కావాలని, వివిధరకాల నైపుణ్యాలను వినియోగించుకోవాలన్నారు. నాక్-ఏ ప్లస్‌ప్లస్, ఎక్సలెన్స్ గ్రేడ్ రావడానికి కావలసిన అన్నిరకాల వసతుల కల్పన, ముఖ్యంగా కళాశాల అదనపు తరగతిగదులు, కళాశాలకు కావలసిన పోటీ పరీక్షల పుస్తకాల ఏర్పాటు, కళాశాలలో బొటానికల్ గార్డెన్ నిర్మాణం, విద్యార్థులకు వైద్య వసతి, సోలార్ ఎనర్జీ కల్పన, మంచినీటి సౌకర్యం, ఇంకుడు గుంతల ఏర్పాటు, అడ్వాన్స్ కంప్యూటర్ లాబ్ ఏర్పాటుకు తోడ్పాటు అందిస్తామని కళాశాల వసతి గృహంపై అదనపుఅంతస్తు నిర్మాణం కోసం సంబంధిత అధికారులు, ప్రభుత్వంతో మాట్లాడి సహాయం చేస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మెటీరియల్ సైన్స్‌లో నూతన ఆవిష్కరణల ద్వార వివిధ శక్తి వనరులను, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. వరంగల్ ఎన్ఐటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ డి.హరినాథ్ కాన్ఫరెన్స్‌లో కీలకోపన్యాసం చేస్తూ మెటీరియల్ సైన్స్‌ను వినియోగించుకొని వివిధ రకాల ప్రాణుల ఆకారాల మాదిరితో బుల్లెట్ ట్రెయిన్, అత్యాధునిక వాహనాలను తయారుచేయడం జరిగిందన్నారు. సదస్సు కన్వీనర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి.అరుణ జాతీయకాన్ఫరెన్స్ ప్రాధాన్యతను తెలియజేస్తూ పర్యావరణ స్పృహ సుస్థిరాభివృద్ధిలో నూతన సాంకేతికతలో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ఉపయోగపడుతున్నాయన్నారు.

ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన వరంగల్ ఎన్వైకె డిప్యూటీ డైరెక్టర్ సిహెచ్.అన్వేష్ మాట్లాడుతూ వివిధ రకాల స్కిల్స్ పెంపొందించు కోవడం ద్వారా విద్యార్థులు శాస్త్ర విజ్ఞాన రంగంలో అగ్రగామిగా నిలవాలనీ,ఎలాన్ మస్క్ లాంటి ప్రపంచ దిగ్గజాల ఆలోచనా ధోరణిని అలవర్చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా అతిథులుఫిజిక్స్ జాతీయ సదస్సు నిర్వాహకులను అభినందించారు. ఈ సదస్సులో 120 మంది రాసిన పరిశోధక పత్ర వ్యాసాలను ఐఎస్‌బిఎన్‌తో సావనేర్‌ను కలెక్టర్ అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. తదనంతరం అతిథులను పుష్పగుచ్ఛం,శాలువా,జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. వివిధ కళాశాలల నుండి వచ్చిన ఉపన్యాసకులు, పరిశోధకులు, ఔత్సాహికులు టెక్నికల్ సేషన్ లో తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. ప్రత్యేకమైన ప్రదర్శనను ఏర్పాటు చేయగా ఇది అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, కో-కన్వీనర్ ఈ.కవిత, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌బాబు, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.అరుణ, అధ్యాపకులు హెప్సిబా, ప్రవీణ్ కుమార్, పద్మసుజాత,మధు, సారంగపాణి, రత్నమాల, సునీత, శ్రీలత, ఉదయశ్రీ, ప్రశాంతి, లక్ష్మీకాంతం, యుగంధర్, రాజు, రమేశ్ కుమార్, రాజిరెడ్డి, రాజేశ్వరి, మమత, బాలరాజు, లకన్ సింగ్, సుభాషిణి, సుమలత, సమత, సురేష్, రాజ్‌కుమార్, భారతి,కృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

- జిల్లా రెవెన్యూ అధికారి వైవీ.గణేష్

నవతెలంగాణ-సుబేదారి



మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరుగుతుందని, గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి వైవి.గణేష్, సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమాలు పేర్కొన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో గంజాయి కేసులతో పాటు గంజాయి ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై వివిధ శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, డిసిపి షేక్ సలీమా మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించే వారిపై, వినియోగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సినిమా హాళ్ల లో కూడా మత్తు పదార్థాల నియంత్రణకు స్లైడ్స్ వేసే విధంగా జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లి చర్యలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాల నిర్వహించాలన్నారు. అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడంతో పాటు విస్తత ప్రచారం చేపట్టేందుకు క్రీడా, ఇతర రంగాలలోని సెలబ్రిటీలతో గంజాయి, ఇతరమత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై విస్తత ప్రచారాన్ని చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌ఓ అప్పయ్య, పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, హనుమకొండ, కాజీపేట ఏసీపీలు దేవేందర్ రెడ్డి, తిరుమల్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల సాధనకు పోరాటం

- టీయూడబ్ల్యూజే ఐజేయు జాతీయ నాయకులు కృష్ణారెడ్డి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

జర్నలిస్టుల సమస్యల సాధన కోసం టియుడబ్ల్యూజే ఐజేయు పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఐజేయు సీనియర్ జాతీయ నాయకులు దాసరి కష్ణారెడ్డి అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు గడ్డం రాజిరెడ్డి అధ్యక్షతన జిల్లా యూనియన్ నూతన సభ్యత్వాల నమోదు కార్యక్రమం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దాసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ముందుండి పోరాటం సాగిస్తున్న సంఘం టియుడబ్ల్యూజే మాత్రమేనని అన్నారు. ఆరు దశాబ్దాల యూనియన్ చరిత్రలో అక్రిడిటేషన్ లు, హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు సాధించి పెట్టడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో వరంగల్ నగరంతో సహా మండల కేంద్రాల్లో జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు, ఇండ్లు సాధించేందుకు పోరాడుతామన్నారు. రాష్ట్రంలో వివిధ కారణాలతో మతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకునేందుకు కృషిచేయడం జరుగుతుందని చెప్పారు. భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ సమస్యల సాధనకై జర్నలిస్టులకు అండగా టీయూడబ్ల్యూజే నిలుస్తుందని, అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్‌కార్డుల జారీ, ఇతర సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయి అమలుపరిచేలా చర్యలు తీసుకుంటామన్నారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్‌కు మరే యూనియన్ సాటి రాదని గుర్తుచేసిన ఆయన దశాబ్దాల చరిత్ర ఉన్న యూనియన్ పై జర్నలిస్టులకు ఎంతో విశ్వాసం ఉందని వారి విశ్వాసానికి అనుగుణంగా జర్నలిస్టు బాధ్యులుగా పనిచేస్తామన్నారు. ఈ సందర్భంగా త్వరితగతిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్,పెండెం వేణు మాధవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్,జిల్లా కోశాధికారి బచ్చు పురుషోత్తం, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, జాతీయ కౌన్సిల్ సభ్యులు వల్లాల బుచ్చిరెడ్డి, జిల్లా నాయకులు డాక్టర్ పొడిశెట్టి విష్ణు వర్ధన్, వరప్రసాద్, ఎంఏ. నయీం, గన్ను సంతోష్, పులికంటి రాజేందర్, ముదిగిరి ఓదెలు, అల్లె రామారావు, ఖాదర్ పాషా, ఎం.రాజేంద్ర ప్రసాద్, రాంమోహన్, బి. శ్రీహరి రాజు, కిరణ్ రెడ్డి, దామోదర్, ఎండి.ఉస్మాన్‌పాషా, తాండూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నుండి రాజ్యాంగాన్ని కాపాడుకుందాం : కాంగ్రెస్

నవతెలంగాణ-పరకాల



బిజెపి దుర్మార్గపు పాలన నుండి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం పరకాల క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల సమాజంలో కొన్ని శక్తులు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తు, ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నాయన్నారు. శాంతి అహింసలను బోధించిన మహాత్ముని స్ఫూర్తితో, అందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్ను కించపరిచే విధంగా పార్లమెంట్లో మాట్లాడడం గర్హనీయమన్నారు. భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని రాహుల్ గాంధీ భారతీయుడు యాత్రతో దేశాన్ని కాపాడుకోవాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలనే ముందు చూపుతో పాదయాత్ర ద్వారా ప్రజలకు వివరించడం జరిగుతుందన్నారు.

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల పట్టణంలో వాడవాడల పాదయాత్రతో ప్రజల్లోకి పోయి భారత రాజ్యాంగాన్ని కాపాడాలని బిజెపి నిరంకుశ పాలన ఎండ కట్టడానికి వారి దుర్మార్గపు చర్యలను ప్రజలకు వివరిస్తామని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల ఏఎంసి చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, సమన్వయకమిటి సభ్యులు సోదా రామకష్ణ, చిన్నల గొనాద్, మాజీ ఎంపీపీ ఒంటెరు రామూర్తి, బుర్ర రాజమౌళి, ఎండి.రంజాన్ అలీ, పోరండ్ల వేణుగోపాల్, పసుల రమేష్, పోరండ్లసంతోష్, మార్క రఘుపతి, మడికొండ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈర్ల చిన్ని, పబ్బ శ్రీనివాస్, దుబాసి వెంకటస్వామి, ఒంటెరు శ్రవణ్, నల్లెళ్ల అనిల్, మంద బొమ్మకంటి చంద్రమౌళి, నాగరాజు,దార్న వేణుగోపాల్, దుప్పటి సాంబశివుడు, బండారి కృష్ణ, ఎల్దండి సురేష్, గడ్డం శివ, ఆలేటి రాజు, కుమరమ్మ లలిత, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులంలో వసతుల తనిఖీ

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ



కాజీపేట మండలం కడిపికొండ పరిధిలో ఉన్న తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల లోని వసతులను హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలో విద్యార్థుల కోసం వండిన భోజన పదార్థాలను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. అదేవిధంగా స్టోర్ రూమ్ లో భద్రపరిచిన బియ్యం సంచులు, వంట నూనెలు, ఆహార పదార్థాలను పరిశీలించారు. గురుకుల పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం , ఇతర ఆహార పదార్థాలను విద్యార్థులకు అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం, వసతి సదుపాయాలు ఉండాలని సంబంధితశాఖ అధికారులు, ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులకు సూచించారు.

రేషన్‌కార్డుల సర్వే నుండి మినహాయింపునివ్వాలి



నవతెలంగాణ-దామెర

రేషన్‌కార్డుల సర్వేనుండి తమకు మినహాయింపు నివ్వాలని కోరుతూ దామెర మండలంలోని పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీడీవో గుమ్మడి కల్పనకు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని కార్యదర్శులు గ్రామాల్లో తాగునీటి సరఫరా, ఎల్ఆర్ఎస్ సర్వే, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 100శాతం ఇంటి పన్నుల వసూళ్లు, ఉపాధి హామీ పనులు చేపట్టడం ఇతర ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనడం వలన ఇప్పటికే పని భారంతో సతమతమవుతున్న సందర్భంలో కొత్త రేషన్ కార్డుల సర్వే పంచాయతీ కార్యదర్శులకు అప్పగించడం మరింత అదనపు భారం అవుతుందని రేషన్ కార్డుల సర్వే నుండి జిపి కార్యదర్శిలకు మీనాయింపు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివశంకర్, కార్యదర్శులు వేణుమాధవ్, సరళ, కవిత తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఐనవోలు



పంతిని గ్రామ మాజీ ఎంపీటీసీ బోయినపల్లి సోమేశ్వర రావు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను బుధవారం కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి వరదరాజేశ్వర్ రావులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు మ దూరి మల్లేశం, కాంగ్రెస్ నాయకులు ఎల్ల కుమార్, చిర్ర శ్రీనివాసు, పూర్ణచందర్‌రావు, స్వామి, మహేందర్, శ్రీధర్, ఎం.చిన్ని, రమేష్ రాజు, కంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణలో ఎల్కతుర్తికి ప్రథమ స్థానం

నవతెలంగాణ-ఎల్కతుర్తి



ప్రోగ్రాం ఆఫీసర్ జిల్లా క్షయ వ్యాధి నివారణ, స్థానిక పీహెచ్‌సీ వైద్య అధికారి డాక్టర్ శ్రీనాథ్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్స్, ఎస్‌హెచ్‌జీల పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ సహకారంతో అవగాహన సదస్సులు. ఫ్రైడే డ్రై డే. కార్యక్రమం నిర్వహించారు. జ్వరసర్వేలు, టీబీ నివారణకు వ్యాధులు, నివారణకు శిబిరాల నిర్వహణ ద్వారా 2024 సంవత్సరానికి గాను టీబీ రహిత గ్రామ పంచాయితీలుగా ఎల్కతుర్తి, సురారం ఎంపికచేయబడినవి. దానికోసం బుధవారం స్థానిక ఎంపీడీవో విజయ కుమార్‌కు ఉత్తమఅవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీ రాజ్ శాఖ, వైద్య శాఖ కలిసి పరస్పర సహకారంతో పని చేస్తూ వ్యాధి రహిత మండలంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ అవార్డు రావడానికి సహకరించిన డీఎంహెచ్‌ఓ అప్పయ్య, జిల్లా టీబి కంట్రోల్ అధికారి హిమబిందు, డాక్టర్ శ్రీనాథ్‌కి, ఎన్ఎంలు, ఆశ.వర్కర్లకు, పంకా శ్రీనివాస్, సూరారం. సానిటషన్ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

బీఆర్ఎస్ పెద్దకోడెపాక కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో బుధవారం మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ గ్రామ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షునిగా సవాసి రమేష్, ఉపాధ్యక్షునిగా పైండ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దాసరి రవి. కోశాధికారిగా పైండ్ల ఐలయ్య. కార్యదర్శి వేములపల్లి కుమారస్వామి. యూత్ అధ్యక్షులు కోగిల రవికిరణ్, ఉపాధ్యక్షుడు పైండ్ల భానుచందర్ ప్రధాన కార్యదర్శిగా నాగెల్లి సురేష్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉగాది శుభాకాంక్షల ప్రతులు ఆవిష్కరించిన జీఎం



నవతెలంగాణ -కోల్‌బెల్ట్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయంలో బుధవారం జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి ఉగాది శుభాకాంక్షల ప్రతులు ఆవిష్కరించారు. సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం సింగరేణి సంస్థ ఉద్యోగస్తులకు తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి ఏరియాకు ప్రతులు పంపగా, వాటిని జీఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం కవీంద్ర, డీజీఎం (పర్సనల్) కావూరి మారుతి, ఏజీఎం(ఐఈడి) ఎస్.జోతి, డీజీఎం(ఫైనాన్స్) సురేఖ, సీనియర్ పిఓ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ - ములుగు

ములుగు జిల్లా కేంద్రంలో ములుగు మండలానికి చెందిన సుమారు 22 మంది లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రాష్ట్ర మంత్రి సీతక్క తనయుడు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దనసరి సూర్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్ కుమార్, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు కుక్కల నాగరాజు, యూత్ కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రాజు, యూత్ నాయకులు ప్రభు, మేకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా కోల్‌వర్కర్‌మహాసభలకు తరలిన సింగరేణి ప్రతినిధులు

నవతెలంగాణ-కోల్‌బెల్ట్

ఈనెల 28 నుండి 30 వరకు రాంచీలో 11వ ఆలిండియా కోల్ వర్కర్ ఫెడరేషన్(సీఐటీయూ) మహాసభలు జరగనున్నాయి. కోల్ ఇండియా అనుబంధ సంస్థలలో పనిచేస్తున్న సీఐటీయూ అనుబంధ సంఘాల ముఖ్య ప్రతినిధులతో పాటు సింగరేణి నుండి సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) నుండి 30 మంది ప్రతినిధులు బుధవారం బయలుదేరి వెళ్లారు. మహాసభలలో బొగ్గు రంగంలో ప్రభుత్వ విధానాల వలన సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలు, బొగ్గు గని కార్మికులు ఎదుర్కొంటున్న మన సమస్యలతో పాటు లేబర్ కోడ్ల వలన బొగ్గు గని కార్మికులకు జరిగే నష్టాలు మరియు కోల్ ఇండియా అగ్రిమెంట్లు సింగరేణిలో అమలు చేయకపోవడం వంటి అనేక అంశాలపై చర్చించనున్నారు. ఈ మహాసభలకు యూనియన్ అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావుతో పాటు భూపాలపల్లి నుండి కంపేటి రాజయ్య పలువురు సిఐటియు ప్రతినిధులు బయలు దేరారు.

తాడిచెర్లలో నకిలీ విత్తనాల బాగోతం !

- శ్రీసాయిరాం ఫెస్టిసైడ్స్ నిర్వాకం
- ఆందోళనలో బాధిత రైతు కుటుంబం
- వరి పంటను పంటను పరిశీలించి ఏవో

నవతెలంగాణ-మల్హర్‌రావు



నకిలీ విత్తనాలను అరికట్టడానికి ప్రభుత్వం ఎన్ని రకాల చర్యలు, చట్టాలు తెచ్చినా రైతులను నకిలీ విత్తనాల నుంచి కాపాడకలేకపోతున్నాయి. పల్లెల్లో రోజురోజుకు నకిలీ విత్తనాల విక్రయాలు పెరిగిపోతూ అమాయక రైతులను ఆసరా చేసుకుంటూ దళారులు నట్టేట్ట ముంచుతున్నారు. ఇందుకు నిదర్శనమే మండల కేంద్రమైన తాడిచెర్ల గ్రామానికి చెందిన రామిడి రాజయ్య అనే కౌలు రైతు. ఇదే గ్రామంలోని శ్రీ సాయిరాం (ట్రేడర్స్), ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణం వద్ద 27 నవంబర్ 2024న సుమారు ఐదు నెలల క్రితం 1010 రకానికి చెందిన వరి విత్తనాలు పది కిలోల బస్తా ఒక్కొక్కటి రూ.750కి మొత్తం 4 బస్తాలు రూ.3వేలకు విక్రయించాడు. రెండున్నర ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని విత్తనాలను నారుపోసి నాటువేశాడు. పొలం అంత పొట్టదశ నుంచి ఇనే దశకు చేరుకుంది. పొలం అంత ఈనకుండా సగం మాత్రమే ఈని వడ్ల గింజలై కోతకు చేరుకుంది. మరో సంగం పొలం మాత్రం ఈనే దశ,తాలు దశలోనే ఉండడంతో తనపొలం నకిలీ విత్తనాలను గురై యిందని బాధిత రైతు ఒక్కసారి ఆందోళనకు గుర్రైయ్యాడు. వెంటనే తనకు విత్తనాలు ఇచ్చిన ఫెస్టిసైడ్ వ్యాపారికి నాలుగు రోజుల క్రితం సమాచారం ఇచ్చాడు. వ్యాపారి రైతు మాట పెడచెవిన పెట్టడంతో మంగళవారం గ్రామ పెద్దలు, మండల వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో బుధవారం మండల వ్యవసాయ అధికారి శ్రీజ, సిబ్బంది పంటను పరిశీలించారు. రైతుకు విత్తనాలు విక్ర యించిన డీలర్, విత్తనాలు పంపిణీ చేసిన కంపెనీ అధికారు లను గురువారం పిలిపించి తమకు న్యాయం జరిగేలా చూస్తామని వ్యవసాయ అధికారులు చెప్పినట్లుగా బాధిత రైతు తెలిపారు. పంట ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఎకరాకు రూ.40వేల ఖర్చులు అయ్యాయని, నకిలీ విత్తనాలు అంటగట్టిన వ్యాపారిపై సంబంధించిన అధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని, లేదంటే ఆత్మ హత్యే శరణ్యమని బాధిత రైతు వాపోయాడు.

క్రాప్ వెరిఫై తరువాత : ఏవో శ్రీజ

తాడిచెర్లలోని రామిడి రాజయ్య అనే రైతు తన పొలం నకిలీ విత్తనాలకు గుర్రైందనే సమాచారం మేరకు బుధవారం వెళ్లి తాము వరి పొలాన్ని పరిశీలించాం. కంపెనీ వారిని, విత్తనాలు విక్రయించిన వ్యాపారిని,రైతును నేడు పిలిపించి వెరిఫై చేస్తాం. ఎంతశాతం నకిలీ విత్తనాలు ఉన్నాయి. వివిధ రకాల కారణాలు తెలుసుకుంటాం.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ

నవతెలంగాణ-గణపురం



ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అన్నిశాఖల అధికారులు సమర్థంగా, సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం గణపురం తహసీల్దార్ కార్యాలయంలో నూతన రేషన్ కార్డులు విచారణ, త్రాగు, సాగు నీరు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, వ్యవసాయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సంబంధిత శాఖల అధికారులు తమ తమ విభాగాలకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితిని వివరించారు. ప్రజలకు అందుతున్న సేవలను మరింత మెరుగు పరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ముఖ్యంగా తాగు, సాగునీటి సమస్యల పరిష్కారం, ఉపాధి హామీ పనుల పురోగతి, రేషన్ కార్డుల జారీ ప్రక్రియ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ వేగవంతంపై అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. పంట పొలాలు ఎండిపోకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి వారం సాగు నీటిపై మండలస్థాయిలో యాసంగి పంటకు నీటి నిర్వహణపై సమీక్షించ నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. యాసంగి పంటకు నీటినిర్వహణపై ప్రతి మండలంలో రెవెన్యూ, వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులు సాగునీటి పంటకు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాగునీరు సమస్య ఎక్కడ వచ్చే అవకాశం ఉంటుందో నీటి పరిష్కారానికి రైతులను భాగస్వామ్యం చేసుకుంటూ అవసరమైన చర్యలను అధికారులు సమన్వయంతో తీసుకోవాలని అన్నారు. రైతులకు నీటి షెడ్యూల్ పై సమాచారం అందించాలని అన్నారు. సాగునీరు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, నీరు అందేలా చూడాలని అన్నారు. నీటి కాల్వల వద్ద నీటిని బ్లాక్ చేయకుండా చూడాలని, ఎక్కడైనా గేట్ బ్లాక్ చేస్తే చర్యలు తీసుకోవాలని అన్నారు. నూతన రేషన్ కార్డుల దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులను గుర్తించాలని సూచించారు. తహసీల్దార్ సత్యనారాయణస్వామి, పంచాయతి, వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

యూత్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దనసరి సూర్య



నవతెలంగాణ - ములుగు

క్రీడల్లో గెలుపోటములు సహజమని, స్ఫూర్తిగా తీసుకొని క్రీడలు ఆడాలని యూత్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దనసరి సూర్య అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని తంగెళ్ళ క్రీడా ప్రాంగణంలో జిల్లా ఏరియా ఆసుపత్రిలో పనిచేసిన జనార్ధన్ స్మారకర్థం వారి కుమారుడు కిరణ్ ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్‌తో కలసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంత పెద్ద ఎత్తున జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పెట్టడం అభినందనీయమని టోర్నమెంట్ నిర్వాహకులను అభినందించారు. యువత ప్రతి రోజు ఏదో ఒక క్రీడను అలవాటు చేసుకుని ఆడాలని అన్నారు. కిరణ్ తండ్రి స్మారకార్థం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ములుగు జిల్లా క్రీడాకారులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ములుగు జిల్లాలో క్రీడా మైదానం కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. జిల్లాలో స్విమ్మింగ్ పూల్ కూడా మంజూరు అయ్యిందని చెప్పారు. రాష్ట్రస్థాయి వరకు ములుగు జిల్లా పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి,ములుగు మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, కాంగ్రెస్ పార్టీ ములుగు పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్ కుమార్, యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుక్కల నాగరాజు, జిల్లా నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు స్వీకరించాలి : జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ

నవతెలంగాణ-భూపాలపల్లి



యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ఆర్థికసాయం అందించడానికి ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖా స్తులు స్వీకరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలి పారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం నుండి మం డల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలు యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపా రు. సొంత వ్యాపారాల స్థాపనకు ప్రభుత్వం రాయితీ అందించనుందని తెలిపారు. సుమారు 75 రకాల యూనిట్ల ఏర్పాట్లుకు పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాస్థాయిలో నోడల్ అధికారిగా డిఆర్డీవో ఉంటారని తెలిపారు. అర్హులైన యువ త https://tgobmms.gg.gov.in ఆన్లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ప్రింట్ తీసిన దరఖాస్తును ఎంపీడీఓ, మున్సిపల్ పరిధిలో ము న్సిపల్ కమిషనర్‌కు అందజేయాలని తెలిపారు. జిల్లాకు చెందిన దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారై, పరిమిత ఆదాయ వనరుల గల బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీ యువత రేషన్, పాన్ కార్డు ఫోన్ నెంబర్, ఫొటో, ఆధార్‌కార్డ్, కుల, ఆదాయ, ధ్రువీ కరణ పత్రా లను దరఖాస్తులో నమోదు చేయాలన్నారు. దరఖా స్తులు స్వీకరణకు ఆఖరు వచ్చే నెల 5వరకు ఉందని అన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అశో క్‌కుమార్, విజయలక్ష్మి, మండల ప్రత్యేక అధికారు లు, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన పేరుతో నిర్బంధ పాలన

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్

నవతెలంగాణ - ములుగు



ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధ పాలన సాగిస్తున్నదని, ఆశావర్కర్ల పట్ల ప్రభుత్వ నిర్బంధంను ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. ఆశాలపై నిర్బంధను నిరసిస్తూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ... రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఈనెల 24న రాష్ట్ర ప్రభుత్వం తమకు ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఫిక్స్ వేతనం రూ. 18వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎఎన్ఎం ట్రైనింగ్ చేసిన ఆశాలకు పదోన్నతులు కల్పించాలని, ఈఎస్ఐ, పిఎఫ్ , ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి బయలుదేరిన ఆశాలను అర్ధరాత్రుల్లు అరెస్టు చేయడం, గృహనిర్బంధించడం, హైదరాబాద్ చేరుకున్న ఆశాలపై పోలీసుల చేత లాఠీచార్జి చేసి దాడి చేయించడం సరికాదని అన్నారు. బడ్జెట్ సమావేశాలు ముగిసే లోపు ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ, 18000 నిర్ణయించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సద్దాం హుస్సేన్, ఆశా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అర్ నీలాదేవి, చుంచు మంజుల, యశోద, రమ, పద్మ, కవిత, రజిత, స్వప్న, లక్ష్మి, విజయ, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

సెలూన్‌షాపుల బంద్ విజయవంతం

- నాయి బ్రాహ్మణ సేవా సంఘం

నవతెలంగాణ-చిట్యాల

భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మంజూరునగర్‌లో ఏర్పాటు చేస్తున్న కార్పొరేట్ సెలూన్ ఏర్పాటును నిరసిస్తూ చిట్యాల మండల కేంద్రంలో చిట్యాల నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సెలూన్లు బంద్ పాటించాయి. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం పిలుపు మేరకు బందు విజయవంతం అయినట్టు చెప్పారు. మంజూరు నగర్‌లో కార్పొరేట్ సెలూన్ ఏర్పాటును నిలిపివేయాలని అన్నారు. నాయి బ్రాహ్మణులు మేడిపెల్లి శ్రీనివాస్, తూముల సంజీవ్, మాదాసు నాగరాజు, దేవేందర్, తూముల శైలేందర్, రాజు కుమార్, మేడిపెల్లి రమేష్, మురహరి, భాను చందర్ భూపతి, నాగవంశి, తదితరులు పాల్గొన్నారు.

మల్హర్‌రావు : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరునగర్ ప్రాంతంలో కార్పొరేట్ సెలూన్ ప్రారంభోత్సవాన్ని నిలిపేయాలని కోరుతూ... భూపాలపల్లి నాయి బ్రాహ్మణ సేవ సంఘం పిలుపు మేరకు బుధవారం మండలంలోని తాడిచెర్ల, కొయ్యుర్, మల్లారం, పెద్దతూండ్లతోపాటు అన్ని గ్రామాల్లో సెలూన్ షాపులు సంపూర్ణంగా బంద్ పాటించాయి. అనంతరం శాంతియుతంగా నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మహాదేవపూర్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మంజూరునగర్ ప్రాంతంలో బ్యూటీ పార్లర్ కార్పొరేట్ సెలూన్‌ను నిలిపేయాలని డిమాండ్ చేస్తూ భూపాలపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గత 4 రోజులుగా సెలూన్ షాపులు బంద్ పెట్టి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. వీరికి మద్దతుగా బుధవారం మహదేవపూర్ మండల కమిటీల ఆధ్వర్యంలో సెలూన్ షాపుల బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు

- ములుగు పోలీసుల ప్రత్యేక చర్యలు
- ములుగు డీఎస్పి నలువాల రవీందర్

నవతెలంగాణ - ములుగు



ములుగు మండలంలో రోడ్డు ప్రమాదాల స్థలాలను గుర్తించి ఆ ప్రాంతాలలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ములుగు డిఎస్పి నలువాల రవీందర్ తెలిపారు. బుధవారం ములుగు మండలం జంగాలపల్లి జంక్షన్, జంగాలపల్లి పెట్రోల్ బంక్, కాశిందేవుపేట క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు డివైడర్ మీద ఏర్పాటు చేసిన ఐరన్ బారికేడింగ్ వల్ల రోడ్డు క్రాస్ చేసే సమయంలో వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయని గమనించి బారికేడింగ్‌ను తొలగించారు. అన్ని గ్రామాలలో రోడ్డు సేఫ్టీ క్లబ్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రతి క్లబ్‌కు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశామన్నారు. గ్రామ పోలీస్ అధికారి, ఇతర గ్రామానికి సంబంధించిన గ్రామస్థాయి ప్రభుత్వ ఉద్యోగులు, రోడ్డుకి ఇరువైపుల ఉండే షాప్ యజమానులు ఉంటారన్నారు. అందరూ సహకరించి రోడ్డు ప్రమాదాలు నివారించడానికి తీసుకునే ముందు జాగ్రత్తలు, రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు సీఐ శంకర్, ఎస్సై సిహెచ్ వెంకటేశ్వరరావు, ములుగు పోలిస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెల్పూర్ పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ తనిఖీ

నవతెలంగాణ-గణపురం



మండలంలోని చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డీఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా అధికారులు పరిశీలించారు. సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. ప్రతి ఏఎన్ఎం, ఆశాలు సబ్ సెంటర్లకు వెళ్లి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వేస విలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిం చాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని ఎవరు ఎండలో తిరగొద్దన్నారు. ఉదయం 10 గం టల వరకు పనులు చేసుకోవాలని సాయంత్రం ఆరు తర్వాత బయటికి వెళ్లాలన్నారు. అనంతరం ఆసు పత్రి లోని ల్యాబ్, ఫార్మసీని పరిశీలించారు. ఈ కార్య క్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నేడు అంబాల పోశాలు సంతాప సభ

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండలంలోని పస్రా గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ కామ్రేడ్ అంబాల పోషాలు సంతాప సభ నేడు నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి అన్నారు. బుధవారం పస్రా గ్రామంలోని పార్టీ కార్యాలయంలో మల్లారెడ్డి మాట్లాడుతూ.. సంతాప సభను పోశాలు స్వగృహం పస్రాలో నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సంతాప సభకు ముఖ్యఅతిథిగా వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా అధ్యక్షుడు బి వెంకట్, రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, బండారు రవికుమార్ హాజరవుతున్నారని, కార్యకర్తలు, నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు పాల్గొన్నారు.



మేడారంలో హుండీల లెక్కింపు

మొత్తం ఆదాయం రూ. 1,08,03,173

నవతెలంగాణ - తాడ్వాయి

మేడారం సమ్మక్క- సారలమ్మ మినీ జాతర హుండీలను దేవదాయ శాఖ అధికారులు భారీ బందోబస్తు నడుమ బుధవారం లెక్కించారు. సమ్మక్క ఆదాయం రూ.58,66,409, సారలమ్మ ఆదాయం రూ.45,61,892, పగిడిద్దరాజు ఆదాయం రూ.1,61,003, గోవిందరాజు రూ.2,13,869 మొత్తంగా సమ్మక్క-సారలమ్మ వనదేవతల ఆదాయం రూ.1,08,03,173 వచ్చినట్లు ఎండోమెంట్ ఈవో రాజేంద్రం తెలిపారు. మినీ జాతర నుండి ఇప్పటివరకు సుమారు 5 నెలల్లో వచ్చిన మేడారం వనదేవతల ఆదాయం అని తెలిపారు. కాగా స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు చందా రఘుపతి, కొక్కెర రమేష్, సిద్ధబోయిన అరుణ్, సిద్ధబోయిన స్వామి, కొక్కెర క ృష?, సిద్దబోయిన మునీందర్, కాక కిరణ్, కాక వెంకటేశ్వర్లు, పాపారావు, నితిన్, సందీప్, బోజారావు, పగిడిద్దరాజు పూజారి పెనక రాజేశ్వరరావు, గోవిందరాజు పూజారి దెబ్బకట్ల గోవర్ధన్, ఎండోమెంట్ ఈవో రాజేంద్రం, ఇన్స్పెక్టర్ నందనం కవిత, సూపర్డెంట్ గుమ్మడవెల్లి క్రాంతి, ఎండోమెంట్ సిబ్బంది రాజేశ్వరరావు, జగన్, మధు, రఘుపతి, బాలకృష్ణ, వీరన్న, సోలం సంపత్, కొప్పుల శ్యామ్ ఎండోమెంట్, ఎఆర్ఐ సునీల్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఆస్తి పన్నుపై ఆఫర్..

90శాతం వడ్డీ మాఫీ..
ఈనెల 31 వరకు అవకాశం
100శాతం వసూళ్లకు కార్యాచరణ
అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

నవతెలంగాణ-భూపాలపల్లి

మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను బకాయిదారులకు ప్రభుత్వం ఆఫర్ ప్రకటించింది. ఈనెల 31వ తేదీ నాటికి పూర్తిగా చెల్లిస్తే 90 శాతం వడ్డీ మాఫీ కానుంది. వన్ టైం సెటిల్మెంట్ (ఓటీ ఎస్) కింద ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో భూపాలపల్లి మున్సిపాలిటీల్లో 30 వార్డులలో సుమారు 12,222 ఇండ్లకు ప్రయోజనం చేకూరనుంది. ఈ క్రమంలోనే మున్సిపల్ అధికారులు వార్డులలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించే పనిలో నిమగ్నమయ్యారు.

భూపాలపల్లి మున్సిపాలిటీల్లో 30 వార్డులలో సుమారు 12,222 ఇండ్లు ఉన్నాయి. 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి గాను భూపాలపల్లి మున్సిపాలిటీలో రూ.5కోట్ల78లక్షల56వేల ఆస్తిపన్ను వసూలు లక్ష్యంగా ఉంది. ఇప్పటివరకు రూ.3కోట్ల78లక్షల 18వేలు వసూలు చేశారు. ఇంకా రూ.2కోట్ల3లక్షల 38వేలు బకాయి ఉంది. దీంతో ఇప్పటివరకు 64. 85శాతానికి చేరుకుంది. ఏటేటా పేరుకుపోతున్న బకాయిలు మున్సిపాలిటీలకు ఇబ్బందికరంగా మారాయి. ఈ క్రమంలో మొండి బకాయిల వసూళ్లపై మున్సిపల్‌శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రభుత్వం ప్రకటించిన 90శాతం వడ్డీ మాఫీని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఆస్తిపన్ను వడ్డీ రాయితీపై మెసేజ్‌లు, అవగాహన, చైతన్య సదస్సుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఆస్తిపన్నుపై 90శాతం వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం ప్రత్యేక జీఓ జారీ చేసింది. ఇప్పటి వరకు ఆస్తి పన్ను చెల్లించని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలి. భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాం. 100శాతం పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టడంతోపాటు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నాం. ఇప్పటికే ఆస్తి పన్ను చెల్లించిన యజమానులకు వారి వడ్డీ రాయితీ భవిష్యత్తు చెల్లింపులతో సర్దుబాటు చేస్తారు. కావున ప్రజలు గమనించాలి. ఆస్తి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి.

- బిర్రు శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, భూపాలపల్లి




మేడారంలో సందర్శకుల సందడి

నవతెలంగాణ -తాడ్వాయి

మేడారం సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు బుధవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు చత్తీస్గడ్ మహారాష్ట్ర నుంచి భక్తులు ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చారు. జంపన్న బాబు స్థాన ఘట్టాల వద్ద బ్యాటరీ వద్ద పుణ్య స్థానాల ఆచరించి కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. అనంతరం గద్దెల వద్దకు చేరుకొని వనదేవతలకు ప్రత్యేక మొక్కులు చెల్లించారు. ఎండోమెంట్ సిబ్బంది, పూజారులు అన్ని సౌకర్యాలు కల్పించారు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- మాత, శిశు మరణాలను నివారించాలి
- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి మల్లిఖార్జున్



నవతెలంగాణ-పాలకుర్తి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచే విధంగా వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి కె.మల్లికార్జున్ ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మల్లికార్జున్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ లేకుండా ప్రసవాలు అయ్యే విధంగా దృష్టి పెట్టాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాలను నివారించాలని తెలిపారు. ఉపాధి హామీ పనుల వద్ద, గ్రామీణ ప్రాంతాల్లో ఓఆర్ఎస్‌లతో పాటు మందులను అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కుక్క, పాము, తేలుకాట్లకు మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత,శిశు మరణాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని, ప్రసవాల సమయంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీలకు తమ ఇళ్ల వద్దకు వెళ్లి తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారులు డాక్టర్ సిద్ధార్థ రెడ్డి, డాక్టర్ ఉష, డెమో ప్రభాకర్, హెచ్ఈఓ శ్రీనివాసరెడ్డి, సిహెచ్ఓ రమణమ్మ, పీహెచ్ఎన్ లిల్లీ దేబోరా, సూపర్వైజర్ ఇంద్రాణి, లతోపాటు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

4వ రోజు పదవ తరగతి గణితం పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ తెలిపారు. 26, మార్చి 2025 నాలుగవ రోజున జరిగిన గణితం పరీక్ష మొత్తం 41 పరీక్షా కేంద్రాలలో జరిగిన గణితం పరీక్షకు జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులు 6238 మంది విద్యార్థులకుగాను 6233 మంది విద్యార్థులు హాజరయ్యారని 5గురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు పేర్కొన్నారు. హాజరు శాతం 99.92గా నమోదైనట్లు తెలిపారు. అలాగే ప్రైవేటు ఇద్దరు హాజరవ్వడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు ఎస్.శ్రీనివాసాచారి జాఫర్గడ్, పాలకుర్తిలలో నాలుగు పరీక్ష కేంద్రాలను సందర్శించారని, అలాగే ప్రత్యేకత బందాలు ఏడు పరీక్ష కేంద్రాలను సందర్శించారని తెలిపారు. ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ టి. రవికుమార్ జనగామలో గల రెండు కేంద్రాలను పరిశీలించారని, నేటి పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ తెలిపారు.

డీఆర్డీఏ ఆధ్వర్యంలో యూడీఐడీ శిబిరం



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం విభాగం కంటి లోపంపై యూనిక్ డిజేబులిటీ ఐడెంటిటీ కార్డు క్యాంపును నిర్వహించినట్లు డిఆర్డిఏ అడ్మిన్ అసిస్టెంట్ మామిడాల రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్డెంట్ గోపాల్ రావు, కంటి విభాగం డాక్టర్లు పద్మప్రభ, ప్రొఫెసర్ వసంత, అసోసియేట్ ప్రొఫెసర్లు ఈవి రాజు, సజన్‌కుమార్, డిఆర్‌డిఏ ఏపీఎంలు వినీత, సురేందర్, కంప్యూటర్ ఆపరేటర్ భవాని తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతంలో మహిళల పాత్ర కీలకం



నవతెలంగాణ-కొడకండ్ల

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గ్రామస్థాయిలో మహిళల పాత్ర కీలకమని పాలకుర్తి నియోజక వర్గం ఇంచార్జ్ హనుమాన్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివిధ గ్రామాల మహిళాఅధ్యక్షుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీ బలోపేతానికి మహిళలు కీలకమని మహిళలు రాజకీయ పార్టీల్లోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించినప్పుడే మహిళలకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను మహిళలు ప్రజలకు వివరిస్తూ పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, మండల మహిళా అధ్యక్షురాలు సువర్ణ,మహిళా అధ్యక్షులతో పాటు కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన డైరెక్టర్ కుటుంబానికి పరామర్శ

మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన పాలకుర్తి దేవస్థానం డైరెక్టర్ ఐతరాజు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలు కాగా చికిత్స అనంతరం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటుండగా పాలకుర్తి నియోజకవర్గం ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి ఆయనను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

వంద మందికి తగ్గకుండా ఉపాధి కల్పించాలి



నవతెలంగాణ-కొడకండ్ల

ప్రతీ గ్రామంలో ప్రతీరోజు వందమందికి తగ్గకుండా ఉపాధి కల్పించేలా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నాగ శేషాద్రి సూరి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు, టీఏలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూలీలు పని చేసే చోట తాగునీటి సౌకర్యం , నీడ, ఫస్ట్‌ఎయిడ్ కిట్లు, కూలీలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన కూలీలకు జాబ్ కార్డు వెంటనే మంజూరు చేయాలని గ్రామాల్లో ఎల్ఆర్ఎస్ చేసుకున్న ప్లాట్లకు ప్రభుత్వం సబ్సిడీ కల్పించినందున వాళ్లకు మోటివేషన్ చేసి రాయితీ వచ్చించేలా డబ్బులు కట్టించాలని కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ ఇందిర, ఏపీవో కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎఫ్ఏలకు ఫస్ట్‌ఎయిడ్ కిట్లను అందజేశారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

పాస్టర్ ప్రవీణ్ మరణంపై సమగ్ర విచారణ జరపాలని మండల పాస్టర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో నియోజక వర్గ కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ దైవసేవకులు ప్రవీణ్ మతోన్మాదుల దుశ్చర్యని, తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి సామరస్యాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో దేవవరం, కేసీజాన్ బన్నీ, బాలస్వామి, ఎన్.టెక్నా, ప్రవీణ్ కుమార్, నిర్మల్ జ్యోతి, ఫిలిప్, పాల్ రాజ్, చార్లెస్, తిమోతి, సింగపురం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

నవతెలంగాణ-పాలకుర్తి

గుడుంబాము తయారుచేసిన, విక్రయించిన చర్యలు తప్పవని పాలకుర్తి ఎక్సైజ్ సీఐ సంతోష రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని టీఎస్ కే తండా శివారు దుబ్బ తండాలో గుడుంబా స్తావరాలపై ఎక్సైజ్ సిబ్బందితో దాడులు నిర్వహించి 50 లీటర్ల బెల్లం పానకం నిల్వలను ధ్వంసం చేసి, ఐదు లీటర్ల కాచిన గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారు చేస్తున్న దుబ్బ తండా క చెందిన గుగులోతు విజయ పై కేసు నమోదు చేశారు. అనంతరం లచ్చు నాయక్ తండాలో గుడుంబా నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ గుడుంబా అన తయారుచేసిన,విక్రయించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాచిన గుడుంబాను తాగితే ఆరోగ్యాలు పాడవుతాయని, కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతాయని తెలిపారు. గుడుంబా రహిత గ్రామాలుగా గ్రామస్తులు ఐక్యమై తీర్చిదిద్దుకోవాలని సూచించారు. లచ్చు నాయక్ తండాకు చెందిన లాకావత్ రాక్రు గుడుంబా తయారు చేస్తుండగా తహసిల్దార్ ముందు లక్ష రూపాయల జరిమానాకు బైండోవర చేశామని తెలిపారు. బైండోవర్ చేసినప్పటికీ గుడుంబా తయారు చేయడంతో ఇటీవలే 25000 జరిమానా విధించామని అన్నారు. గుడుంబా ను తయారుచేసిన, విక్రయించిన ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది ఎండి సర్వర్, ఎండి మదర్ పాషా, ఆర్ నవీన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా నిలుస్తా : సింగపురం ఇందిర



నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

కన్నతల్లిలాంటి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఎల్లవేళలా అండగా ఉంటూ, కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా ఆదుకుంటానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇంచార్జీ సింగపురం ఇందిర అన్నారు. బుధవారం రఘునాథపల్లి మండలంలో పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో తెచ్చేందుకు పదేండ్లు కార్యకర్తలు కష్టపడి, పార్టీకి కట్టుబడి పనిచేశారని అలాంటి కార్యకర్తలను అధికారంలోకి వచ్చాక వారిని ఆదుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు ఆరు నెలల క్రితం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కార్యకర్తలను పట్టించుకోవడంలేదని ఆరోపిస్తూ, ఏఐసిసి, టీ పిసిసికి ఫిర్యాదు చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే కడియం తీరు ఇప్పటికైనా మార్చుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కోళ్ల రవి, యువజన నాయకులు కీసర దిలీప్ రెడ్డి, మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మి నరేందర్, మాజీ ఎంపీటీసీలు అల్లిబిల్లి క్రిష్ణ, కొమురెల్లి, మల్లేష్, రాజ్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అప్‌గ్రేడ్ ఐనా ప్రభుత్వాసుపత్రిలో తప్పని తిప్పలు





ఓపి విభాగంలో బారులు తీరిన రోగులు



తాళం వేసిఉన్న సిటీస్కాన్ గది

నవతెలంగాణ-జనగామ

ప్రభుత్వ ఏరియా ఆ సుపత్రి నుండి ప్రభుత్వ జి ల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి గామారినప్పటికీ రోగులకు మెరుగైన సేవలు అందడం లేదు. వైద్య పరికరాలు పూ ర్తిస్థాయిలో అందు బాటులో లేక, ప్రత్యేక నైపుణ్యత వై ద్యులు లేకపోవడంతో జిల్లా ఆసుపత్రిలో రోగులకు నామమాత్రపు వైద్యసేవలే అం దుతున్నాయి. జనగామ జి ల్లాతోపాటు సిద్ది పేట, యా దాద్రి, భువనగిరి , సూర్యా పేట తదితరజిల్లాలోని చు ట్టుపక్కల గ్రామాల ప్రజలు వైద్యం కోసం జనగామ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వస్తూ ఉంటారు.

అలాగే 2023లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరైంది. వైద్య విద్యార్థులు ఎంసిహెచ్‌తోపాటు జనరల్ ఆసుపత్రిలో ప్రాక్టికల్స్ చేయవలసి ఉంటుంది. దీనితోపాటు ప్రతిరోజు సుమారు 600కు పైగా ఓపి వైద్య సేవలు వినియోగించుకుంటారు. ఇంత ప్రాధాన్యత కలిగిన జనగామ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో రోగులకు వైద్య సేవలతో పాటు పరికరాలు అందుబాటులో లేవు.

వైద్య పరికరాల కొరత....

జనగామ ప్రభుత్వ జనరల్ ఆ సుపత్రిలో రోగు లకు అవసరమైన వైద్య పరికరాలు అందుబాటులో లేవు. సిటీస్కాన్‌తోపాటు న్యూరో, కార్డియాలజీ, నెఫ్రాలజీ డిపార్ట్‌మెంట్‌లకు వైద్యపరికరాలే కాకుండా ఆసుపత్రిలో వైద్య సేవలు కూడా అందడం లేదు. గత కొన్నేళ్లుగా మరమ్మతులో ఉన్న సిటీస్కాన్ నేటికీ మరమ్మతుకు నోచుకోలేదు సిటీస్కాన్ సేవలు అందుబాటులో లేవు.

తప్పని రెఫరల్ సమస్య....

జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిగా మారినప్పటికిని రోగులను వరంగల్ హైదరాబాద్ కు రిఫరల్ చేయడం మాత్రం తగ్గడం లేదు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి వైద్య పరికరాలతో చిన్న చిన్న సర్జరీలు చేస్తున్నారే తప్ప ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేయవలసిన అన్ని సేవలు అందడం లేదు. దీనితో వివిధ కారణాలు చెబుతూ వైద్యులు రోగులను హైదరాబాద్, వరంగల్ కు పంపిస్తున్నారు.

పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాని వైద్య సేవలు...

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఏర్పడినప్పటికీ పూర్తి స్థాయిలో స్పెషలిస్ట్ డాక్టర్లతో పాటు టెక్నీషియన్లు అందు బాటులో రాలేదు. న్యూరో కార్డియాలజీ నెఫ్రాలజీలతో పాటు, మరికొంతమంది జనరల్ సర్జరీ డాక్టర్ల సేవలు అందుబాటులో ఉండవలసి ఉంది. కానీ ఒకరిద్దరి సర్జన్లతోటే సర్దుకుపోయే పరిస్థితి నెలకొంది. పేరుకు మాత్రమే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కానీ ఆ స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. దీనితోపాటు కొంతమంది జూనియర్ రెసిడెన్సి డాక్టర్లు సీనియర్ రెసిడెన్సి డాక్టర్లు ఉండవలసి ఉంది. కానీ వారు అందుబాటులో లేరు. అలాగే పీజీ పూర్తి చేసుకున్న విద్యార్థులు రూరల్ ఏరియాల్లో మూడు నెలలు వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం నిబంధనలు ఉన్నాయి. అందులో భాగంగా మల్లారెడ్డి మెడికల్ కళాశాలకు చెందిన విద్యార్థులను జనగామ జనరల్ ఆసుపత్రికి కేటాయించారు. కానీ ఒక్కరు కూడా ఇక్కడ సేవలు అందించడం లేదు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి...

జిల్లాలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిగా అప్గ్రేడ్ అయిన తర్వాత కూడా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన రోగులు మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు కోసం వస్తూ ఉంటారు.వీరికి మెరుగైన వైద్య సేవలు అందించవలసిన బాధ్యత ప్రభుత్వానిది. అందుకు అనుకూలంగా వైద్యులను వైద్య పరికరాలను అందుబాటులో తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అండర్‌పాస్ బ్రిడ్జి కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తాం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

నవతెలంగాణ-జనగామ

జనగామ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద నిర్మాణం జరుగుతున్న బైపాస్ రోడ్ లో అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించి ప్రజలు నాదుకోవాలని లేకుంటే పోరాటాన్ని ఉదతం చేస్తామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం బూడిద గోపి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కనకారెడ్డి పాల్గొని మాట్లాడుతూ అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గత 62 రోజులుగా రిలే నిరాహార దీక్షలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడం సరైనది కాదన్నారు. అభివృద్ధి పేరుతో రోడ్డు మూసివేసి సుమారు 10వేల మందికి ఉపయోగపడే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడం ప్రజలపై ప్రభుత్వాలకు ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థం అవుతుందన్నారు. ఈ విషయంపై ఇప్పటికే అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకపోవడంతో పాటు అన్ని రాజకీయ పార్టీల సహకారం కూడా కోరడం జరిగిందన్నారు. అదే సందర్భంగా భువనగిరి నియోజకవర్గ పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి కూడా వినతిపత్రం ఇచ్చి బైపాస్ రోడ్డు నిర్మాణం జరిగే విధంగా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం నుంచి స్పందన లేకపోవడం వలన మూడో విడత, మొదటి, రెండు ఇందిరమ్మ కాలనీల, ఎస్ రెడ్డి నగర్ మూడో విడత ఇందిరమ్మ కాలనీ, ఎల్లముల, సిద్ధంకి, చౌదరి పెళ్లి, పెద్దరామ చర్ల, పోసన్నపేట, శ్రీనివాసపురం, గుండ్లగూడెం వెళ్లే గ్రామాల ప్రజలకు ఇబ్బందులు జరుగుతాయని చెప్పిన అధికారులు పట్టించుకోకపోవడం సరైనది కాదన్నారు. నేటి నుండి దశలవారిగా అన్నివర్గాల ప్రజల సహకారంతో పోరాటాన్ని ఉధృతం చేయడంతో పాటు బైపాస్ రోడ్డు పనుల నిర్మాణం జరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.



ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జనగామ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈర్రి అహల్య, సింగారపు రమేష్, బోట్ల శేఖర్, జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు భూక్య చందునాయక్, పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, బాల్నేవెంకటమల్లయ్య, బూడిద ప్రశాంత్, పల్లెర్ల లలిత, మంగ బీరయ్య, నాయకులు ధర్మభిక్షం, మల్లేష్, ఆనందం, జయ, ఎల్లయ్య, బిక్షపతి, సంపత్, హరీష్,సుధాకర్, రాజు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

'మోర్' సూపర్ మార్కెట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- కాలంచెల్లిన వస్తు విక్రయాలతో పసిపిల్లల ప్రాణాలతో చెలగాటం
- సూపర్ మార్కెట్ ఎదుట సీపీఐ(ఎం) నాయకుల ధర్నా



నవతెలంగాణ-జనగామ

జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు వద్దగల మోర్ సూపర్ మార్కెట్లో కాలంచెల్లిన తిను బండారాలను విక్రయిస్తూ పసిపిల్లల ప్రాణాలతో ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న మోర్ సూపర్ మార్కెట్ యాజమాన్యంపై కఠినచర్యలు తీసుకొని వెంటనే సీజ్‌చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ డిమాండ్ చేశారు. గడువు ముగిసిన వస్తువులను అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మోర్ సూపర్ మార్కెట్‌ను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో స్థానిక సూపర్ మార్కెట్ ఎదుటధర్నా నిర్వహించారు.

రెండురోజుల క్రితం జనగామ మండలం చీటకోడూరు గ్రామానికి చెందిన ఒక రైతు బండారి లక్ష్మణ్ మోర్‌సూపర్ మార్కెట్లో యోగాబార్ ఫ్రూట్స్ అండ్ నట్స్ సీడ్స్ అనే ప్యాకింగ్ ఫుడ్ ఐటమ్‌ను వారి పిల్లల కోసం కొనుగోలు చేసి తినిపించగా వారు అనారోగ్యానికి గురయ్యారు. తీరా ప్యాకింగ్‌పైన డేట్ చూడగా మార్చి 19కే ఎక్స్పైరీ అయిపోయిందని చూసి బుధవారం ఉదయం సూపర్ మార్కెట్‌కు వచ్చి సిబ్బందిని నిలదీశారన్నారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) నాయకులు బాధితునితో కలిసి మోర్‌సూపర్ మార్కెట్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా సీపీఐ(ఎం) నాయకులు జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ దృష్టికి ఫోను ద్వారా సమాచారం తెలియజేయగా వెంటనే స్పందించి మున్సిపల్ కమిషనర్ వెంకటేశం తక్షణమే అక్కడికి వెళ్లాల్సిందిగా ఆదేశించగా మున్సిపల్ అధికారులు ఇక్కడికి వచ్చారు.విషయాన్ని పరిశీలించిన మున్సిపల్ అధికారులు అక్కడికి వచ్చిన ఎస్ఐ రాజేష్ సమక్షంలో సూపర్ మార్కెట్‌కు తాళం వేసి సీజ్ చేశారు.

ఈ సందర్భంగా గోపి, ప్రకాష్‌లు మాట్లాడుతూ గడువు ముగిసిన వస్తువులను ప్రజలను అమ్ముతూ సూపర్ మార్కెట్ పేరుతో డబ్బులు దండుకుంటున్నారని అన్నారు. గతంలో అనేకమార్లు ఇదే పరిస్థితి నెలకొంది అన్నారు. 15 రోజుల క్రితం ఇలాంటి ఎక్స్పైర్ డేట్‌అయిన తినుబండాలని అమ్మితే వీరికి జరిమానా కూడా వేశారని తెలిపారు. ఫైన్ కట్టడం వీరికి పరిపాటిగా మారిందన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ లాభాపేక్ష ధ్యేయంగా నిర్వహిస్తున్నా మోర్ సూపర్ మార్కెట్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేకమైన తనిఖీలు నిర్వహించి అన్ని సూపర్ మార్కెట్లు సక్రమంగా, వినియోగదారులకు నాణ్యమైన తిరుబండారాలు, వస్తువులు అమ్మే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు భూక్య చందునాయక్, పట్టణ కమిటీ సభ్యులు బొట్ల శ్రావణ్, పాము శ్రీకాంత్, బూడిది ప్రశాంత్, ధరావత్ మహేందర్,బూడిది సంపత్, యాకన్న, ఆర్య మల్లేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

కోఠి మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు అభినందనీయం



నవతెలంగాణ-పాలకుర్తి

భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం వీరోచితంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొరల ఆగడాలను ఎదిరిస్తూ పోరాట చరిత్రను సృష్టించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పేరు ను కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాదులో గల కోఠి మహిళాయూనివర్సిటీకి నామకరణం చేయడం అభినందనీయమని ప్రముఖ జర్నలిస్ట్ పాశం యాదగిరి అన్నారు. డాక్టర్ రవి కుమార్ దర్శకత్వంలో డాక్టర్ సంధ్య డైరెక్టర్‌గా ఐలమ్మ డాక్యుమెంటరీ చిత్రీకరణ పోస్టర్‌ను బుధవారం మండల కేంద్రంలో గల ఐలమ్మ కాంస్య విగ్రహం వద్ద డాక్టర్ రవి కుమార్, డాక్టర్ సంధ్యలతో కలిసి ఆవిష్కరించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్, డాక్టర్ సంధ్యతో కలిసి పాశం యాదగిరి మాట్లాడుతూ ఐలమ్మ పోరాటస్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం తెలుగు, ఇంగ్లీషు పాఠ్యపుస్తకాల్లో ఐలమ్మ పోరాట చరిత్రను పొందుపరచాలని అన్నారు. ఊరూరా ఐలమ్మ విగ్రహాలను ఏర్పాటు చేసినప్పుడే ఐలమ్మ పోరాటానికి సార్ధకత ఉంటుందని తెలిపారు. జనగామ ప్రాంతానికి ప్రత్యేక చరిత్ర ఉందని గుర్తు చేశారు. రక్తంతో తడిసిన పునీతమైన నేల అని, ఈ మట్టితో వీర తిలకం దిద్దుకోవాలని గుర్తు చేశారు. ప్రస్తుత తరుణంలో సాయుధ పోరాట చరిత్ర క్షీణిస్తుందని, భావితరాలకు చరిత్ర గాథలను వివరించేందుకు డాక్యుమెంటరీ చిత్రీకరణ చేస్తున్నారని తెలిపారు. ఐలమ్మ పోరాటాలను భావితరాలకు అందించేందుకు ఏప్రిల్ 2న కోటి మహిళా యూనివర్సిటీలో డాక్యుమెంటరీ చిత్రీకరణ ఆవిష్కరణ జరుగుతుందని ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని డాక్యుమెంటరీ ఆవిష్కరణను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు చిట్యాల శ్వేత, సిపిఎం మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి జి.సాంబయ్య, మాజీ జెడ్పిటిసి పుస్కూరి శ్రీనివాసరావు,చిట్యాల సంపత్, రాపర్తి మంజుల, సోమ అశోక్ బాబు, చిట్యాల యాకయ్య, చిట్యాల కొండయ్య, సంఘీ వెంకన్న, వీరమల్ల రాజు, ఈదునూరి మదర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు రాజకీయాల్లో రాణించాలి

- మహిళ సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట
- స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా మహిళలు పనిచేయాలి
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి



నవతెలంగాణ-పాలకుర్తి

మహిళలు రాజకీయాల్లో రాణించి సమాజానికి ఆదర్శంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఐలమ్మ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ లావుడియా మంజులతో కలిసి ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ మహిళ సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. మహిళలందరినీ కోటీశ్వరులుగా చేసేందుకే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతుందని తెలిపారు. మహిళల సంక్షేమాన్ని దష్టిలో పెట్టుకుని మహిళలందరికీ ఉచిత బస్సుప్రయాణం, రూ.500లకే గ్యాస్, గృహ అవసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పంపిణీ, డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ రుణాలు అందిస్తూ మహిళలు వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. స్థానిక ఎన్నికలే లక్ష్యంగా మహిళలు పార్టీ పటిష్టత కోసం పనిచేయాలని, సంక్షేమ పథకాల అమలును ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ చేపట్టే కార్యక్రమాల విజయవంతానికి మహిళలే ప్రధాన భూమిక పోషించాలని సూచించారు. గ్రామ సమస్యల పట్ల పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు.

మహిళలందరూ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండే విధంగా నిరంతరం కృషి చేయాలని సూచించారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకొని అధిష్టానం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కోఆర్డినేటర్లు కే గోపాల్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, మహిళ అధ్యక్షురాలు బండిపెళ్లి మనెమ్మ లతోపాటు గ్రామాల మహిళ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఐలయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు



నవతెలంగాణ-పాలకుర్తి

లొంక ఐలయ్య మతి కాంగ్రెస్‌పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మండలంలోని ఈరవెన్ను గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త లొంక ఐలయ్య ఇటీవలే మృతి చెందడంతో బుధవారం ఝాన్సీరెడ్డి ఐలయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఐలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఐలయ్య కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం కోసం అహర్నిశలు కృషి చేశాడని తెలిపారు. ఐలయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మండలంలోని లక్ష్మీనారాయణ పురం గ్రామానికి చెందిన పోగుయశోద, మల్యాల నర్సయ్య, తూటి నాగన్న అనారోగ్యాలతో బాధపడుతూ ఇటీవలే మృతి చెందడంతో మతుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాల పోగు చిరంజీవి, పోగు వెంకటేశ్వర్లు లను ఝాన్సీ రెడ్డి పరామర్శించారు.

ఈరవెన్ను గ్రామానికి చెందిన ముస్కు కేశవులు, లక్ష్మీనారాయణ పురం గ్రామానికి చెందిన బొడిగే మారయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఝాన్సీరెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి మృతి

నవతెలంగాణ-పాలకుర్తి



ద్విచక్ర వాహనం అదుపుతప్పి మైనర్ విద్యార్థి మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని పెద్దతండ (కె)సిత్య తండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దతండా (కె) గ్రామ శివారు సిత్య తండాకు చెందిన ధరావత్ రజిత రమేష్ దంపతుల కుమారుడు ధారావత్ దేవేందర్ (16) ద్విచక్ర వాహనం నడుపుతూ పెద్ద తండా కె గ్రామ శివారులో గల దుర్గమ్మ ఆలయ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, శవ పంచనామా అనంతరం జనగామ ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించామని ఎస్సై దూలం పవన్ కుమార్ తెలిపారు. మృతుడు దేవేందర్ 9వ తరగతి చదువుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా గత కొద్ది రోజులుగా పాఠశాలకు వెళ్లడం లేదని గ్రామస్తులు తెలిపారు. రజిత,రమేష్ దంపతులకు ముగ్గురు సంతానమని, మృతుడు దేవేందర్‌తో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో మృతుడి తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి. తండావాసులకు కన్నీరు పెట్టించాయి..

గంజాయి సేవిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-బయ్యారం:

గంజాయి సేవిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గార్ల-బయ్యారం సీఐ బి.రవి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఒక వ్యక్తి గంజాయి సేవిస్తున్నాడనే నమ్మదగిన సమాచారం రాగ బయ్యారం ఎస్ఐ తన సిబ్బందితో తన ఇంటికి వెళ్లి పంచుల సమక్షంలో గంజాయి సేవిస్తున్నాడని ఇంటిగ్రేటెడ్ ఈ-జడ్ యూరిన్ టెస్ట్ చేయగా తనకి గంజాయి సేవిస్తున్నట్టు పాజిటివ్ రావడంతో అతన్ని ప్రశ్నించగా తాను హైదరాబాదులో కాలేజ్ చేస్తున్న సమయంలో గంజాయికి అలవాటు పడి కాలేజీ మానేసి బయ్యారం వచ్చి మహబూబాబాద్ లో గుర్తు తెలియని వ్యక్తి వద్ద నుండి కొనుగోలు చేసి సేవిస్తున్నానని నేరాన్ని ఒప్పుకున్నాడని తెలిపారు. బయ్యారం ఎస్ఐ ఫిర్యాదు మేరకు గార్ల బయ్యారం సీఐ బి.రవి కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

రాజీవ్ యువ వికాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్



నవతెలంగాణ-కేసముద్రంరూరల్:

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాస్ పథకాన్ని తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కేసముద్రం మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ కోరారు. మహిళలకు కుట్టు మిషన్లు, కిరాణం షాపు, బ్యాంగిల్ స్టోర్, బ్యూటీ పార్లర్‌తో పాటు ఇతర అవకాశాలు ఉన్నాయి. పురుషులకు కూడా ఫోటో స్టూడియో, వాటర్ ఫిల్ బైక్‌కు సంబంధించినవే గాక ఇంకా ఇతరత్రా చాలా ఉన్నాయని s ఏదైతే వృత్తిని ఎంచుకుంటారో, ఏదైతే వ్యాపారాన్ని చేయాలనుకుంటున్నారో ఆవ్యాపారం పెట్టుకొని మీకుటుంబ అభివృద్ధి కోసం పాటుపడాలని ఆశిస్తూ ఈఅవకాశాన్ని తెలంగాణ ఎస్టీ, ఎస్సీ బీసీ మైనార్టీలకు క్రిస్టియన్స్ వారికి కూడ అవకాశం ఉందన్నారు. కావున ప్రభుత్వం మనకు అవకాశం కల్పించినందుకు సద్వినియోగపరుచుకోవాలని ఆశిస్తూ ప్రతి ఒక్కరూ అర్హులైన వారు ఈ దరఖాస్తు పెట్టుకొని ప్రభుత్వం నుంచి వచ్చే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఆశిస్తూ మనకు ఈ అవకాశం కల్పించిన పెద్దలకు సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

మున్సిపాలిటీలో పన్నుల భారాన్ని తగ్గించాలి..!



- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలువాల వీరయ్య

నవతెలంగాణ-మరిపెడ

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీలో పెంచిన పన్నుల భారాన్ని తగ్గించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలువాల వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మరిపెడ పట్టణ కేంద్రంలోని జరిగిన మండల కమిటీ సమావేశంలో వీరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న మరిపెడను ఏకంగా మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం తదనంతరమే తన స్వార్థ రాజకీయాల కోసం పన్నులు పెంచడంతో కొంతమందికి భారంగా మారిందని వీరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా పన్నులు పెంచడంతో పట్టణ ప్రజలు తట్టుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. 500 జనాభా కలిగిన తండాలను తండా పంచాయతీలు చేయకుండా మున్సిపాలిటీలో యాడ్ చేసి తండాలను పట్టణ కేంద్రాలను ఒకే కోణంతో చూడడం సరైంది కాదన్నారు. 2017లో ఏర్పడిన మున్సిపాలిటీ తండాలలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే అన్న చందంగా ఉందని ఆరోపించారు. అంతేగాక గతంలో వచ్చిన నిధులు మున్సిపాలిటీకి ఖర్చుపెట్టిన వివరాలను బహిర్గతం చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. మున్సిపాలిటీకి వచ్చిన నిధులన్నీ అభివృద్ధి చేయకుండానే ఎవరి జేబులోకి వెళ్లాయో పట్టణ ప్రజలందరికీ తెలుసన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునర్ ఆలోచన చేసి పెంచిన ఇంటి పన్ను, ఆదాయ పన్ను భారాన్ని తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇది ఇలా ఉంటే పట్టణంలో కొన్ని వార్డులలో మంచినీటి కొరత ఏర్పడుతుందని, మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో అందడం లేదని అధికారులు స్పందించి తాగునీటి కొరత లేకుండా చూడాలని కోరారు. ఈసమావేశంలో మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్, పార్టీ ఆర్గనైజర్ బాణాల రాజయ్య, మండల కమిటీ సభ్యులు కందాల రమేష్, కొండ ఉప్పలయ్య, బోడపట్ల రాజశేఖర్, దొంతు మమత, తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏలకు వేతనం రూ.20 వేలు ఇవ్వాలి



- అక్రమ అరెస్ట్‌లను ఖండించండి
- వివేకానంద సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

నవతెలంగాణ-మహబూబాబాద్

ఐకేపీ వీవో ఏ లకు వేతనం రూ 20వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ మంగళవారం జరిగిన చలో హైదరాబాద్ సందర్భంగా వీవోఎల అక్రమంగా అరెస్ట్ చేయడానికి నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక వివేకానంద సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగిస్తున్నామని అంటున్నారని కాని మహిళలైనా ఐకేపీ వీవోఎలను అర్ధరాత్రి పూట అరెస్ట్ చేయడమేనా ప్రజా పాలన అంటే అని ప్రశ్నించారు. వీవోఎలపైన ప్రభుత్వం నిర్బంధాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. సర్ఫ్ కార్యాలయం వద్ద ప్రభుత్వం, పోలీసుల నిర్బంధ చర్యల వలన అనేకమందికి గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలని చూడకుండా ఈడ్చికెళ్లి పోలీసు వ్యాన్లలో పడేశారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఐకెపి వీవోఎలకు న్యాయం చేస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో ఐకేపీ వీవోఎలకు వేతనం రూ.20వేలు ఇస్తూ నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సమ్మెట రాజమౌళి, కుమ్మరి కుంట్ల నాగన్న, మచ్చా వెంకన్న, రజాక్, ఐకెపి వీవోఎ జిల్లా కార్యదర్శి చింతా మౌనిక, జిల్లా ఉపాధ్యక్షులు వెలిశాల సుధాకర్, అరుణ, శోభ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా కంకర రోడ్డుపై మరమ్మత్తులు



- నవతెలంగాణ కథనానికి స్పందన
- కొండలమ్మ దేవాలయానికి బీటీ రోడ్డు కల నేర వేరేనా..! అనే శీర్షికతో కథనం

నవతెలంగాణ ఎఫెక్ట్

నవతెలంగాణ-గార్ల:

మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామ సమీపంలో ఉన్న కొండలమ్మ దేవాలయంకు బీటీ రోడ్డు నిర్మాణం కల నేర వేరేనా...! అనే శీర్షికతో ఈనెల 10న నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనంతో స్పందించిన అధికారులు బుధవారం కంకర రోడ్డుపై డస్ట్‌ను పోసి, రోలర్‌తో చదును చేయించారు. కాకతీయుల కాలం నాటి అద్భుతమైన కట్టడం కొండలమ్మ దేవాలయంకు గత ప్రభుత్వం హయాంలో రూ.80 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి 18 నెలలు గడుస్తున్నప్పటికి నేటికీ నిర్మాణం చేపట్టక పోవడం, ఈనెల 28 నుండి 31 వరకు ఉగాది సందర్భంగా నాలుగు రోజుల పాటు కొండలమ్మ జాతర ఉత్సవాలు జరుగుతాయి. ఈక్రమంలో కంకర రోడ్డుపై భక్తులు ఇబ్బందులు పడకుండా పత్రికలో వచ్చిన కథనంపై స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య, సంబంధిత అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపాదికన మరమ్మత్తులు చేపట్టారు.

సీపీఐ(ఎం) గ్రామ శాఖ అధ్వర్యంలో ఐదు రోజుల క్రితం రాస్తారోకో

నవతెలంగాణ దినపత్రికలో కొండలమ్మ దేవాలయంకు బీటీ రోడ్డు నిర్మాణం కల నేర వేరేనా..! అనే కథనం, జాతర కు వచ్చే భక్తులు, వాహనదారులకు తప్పని తిప్పలు అనే సబ్ టైటిల్‌తో పేరుతో ప్రచురితమైన కథనంతో సీపీఐ(ఎం) పినిరెడ్డిగూడెం గ్రామ శాఖ కమిటీ అధ్వర్యంలో గ్రామస్థులు, సమీప ప్రజలతో రాస్తారోకో నిర్వహించి సంబంధిత అధికారులపై ఒత్తిడి తెచ్చారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టడం అభినందనీయమని సాధ్యమైనంత త్వరగా బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి వంగూరి కొండయ్య కోరారు. గ్రామ ప్రజలు, సమీప ప్రాంతాలకు చెందిన ప్రజలు నవతెలంగాణ దినపత్రిక కు కృతజ్ఞతలు తెలిపారు.



ఘనంగా బంగారు మైసమ్మ కళ్యాణ మహోత్సవం

- వెన్నం శ్రీకాంత్ రెడ్డి దంపతులు ఆధ్వర్యంలో కళ్యాణం..

నవతెలంగాణ-మహబూబాబాద్

జిల్లాలోని మహబూబాబాద్ మండలం రెడ్యాల గ్రామంలో బంగారు మైసమ్మ దేవస్థానంలో దేవీ కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కళ్యాణంలో లో ఎంతో ఆధ్యాత్మికంగా సంతరించుకుంది. భక్తుల సందడి మధ్య, వేద మంత్రోచ్చారణలతో, పవిత్ర మంగళ వాయిద్యాల నడుమ ఒగ్గు పూజారులు పూజల మధ్య అమ్మవారి కళ్యాణం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉత్సవం సందర్భంగా గ్రామంలో హారతులు, సంబరాలు, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. అంతేకాకుండా, అమ్మవారి కళ్యాణానికి హాజరైన భక్తులు తమ మనోరథాలను చెబుతూ, సద్భావనతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వెన్నం శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సంవత్సరం విడిచి సంవత్సరం మైసమ్మ అమ్మవారి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. రైతులు, గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు, పశుపక్ష్యాధులు సమృద్ధిగా వుండాలని ఈ కల్యాణం నిర్వహిస్తామని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, మా అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం, జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు బండారి వెంకటరమణ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు పొన్నాల యుగంధర్, వార్డెన్ మోహన్, భిక్షపతి, సురేందర్‌రెడ్డి, నర్సింగం శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఏపీవోను మరిపెడ నుండి బదిలీ చేయాలి

- సీపీఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ
- డీఆర్‌డీవో పీడీకి ఫిర్యాదు

నవతెలంగాణ-మరిపెడ

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మరిపెడ మండలం ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న మంగమ్మ దీర్ఘకాలికంగా తిష్ట వేసుకొని ఒకే చోట గత 13 సంవత్సరాలుగా పనిచేస్తూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వెంటనే ఏపీవో మంగమ్మను బదిలీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మహబూబాబాద్ డీఆర్‌డీవో పీడీకి ఆయన ఫిర్యాదు చేశారు. మరిపెడ మండలంలో నీలకుర్తి గ్రామంలో రూ.8 లక్షలు అవినీతి జరిగిందని ఆఅవినీతిలో ఏపీవోకు సంబంధం ఉందన్నారు. ఉపాధి హామీ పనుల్లో అవినీతి అవకతవకలను ఆమె ఏపీవోగా ఉంటూ అవినీతి బయటికి రాకుండా మభ్యపెడుతుందని బాలకృష్ణ ఆరోపించారు. ఇటీవల కాలంలో భారీ స్థాయిలో బయటపడటం తన సొంత మండలంలోని తాను దీర్ఘకాలంగా పనిచేయడం వలన రాజకీయ ప్రాబల్యం ఉండటం వలన సాధారణ బదిలీలు జరిగినా కూడా తాను ఇక నుండి బదిలీ కాకుండా మళ్లీ ఇదే చోట యధావిధిగా పోస్టింగ్‌లో కొనసాగుతూ వస్తుందని, తక్షణమే ఆమెను బదిలీ చేయాలని రాష్ట్రవ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా జరిగిన సాధారణ బదిలీలల్లో అందరూ ఎపీవోలు నాలుగైదు సంవత్సరాల ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. కాని మరిపెడ ఏపీవో మాత్రం గత 13 సంవత్సరాల నుండి మరిపెడ మండలం నుండి బదిలీ కాలేదు. ఈ మండలం నుండి బదిలీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతేగాక ఉపాధి హామీలో నేటికీ ఇంకా కొనసాగుతున్న అవినీతిని అరికట్టాలని అధికారులను కోరారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై మానవతావాదుల నిరసన

నవతెలంగాణ-కేసముద్రంరూరల్

కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో మానవతావాదులందరూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పై అనుమానాలను వ్యక్తపరుస్తూ నిరసన ప్రదర్శన చేశారు. హైదరాబాద్ ప్రాంతంలో క్రైస్తవ ప్రబోధకుడిగా సేవలు అందిస్తున్న ప్రవీణ్ పగడాల అనే దైవ సేవకులు ఈ నెల24న సుమారుగా రాత్రి 11 గంటలకు విజయవాడ నుండి రాజమండ్రి మార్గంలో మధ్యలో అనుమానాస్పదంగా మృతి చెందడం జరిగింది. ఇదివరకే తనను చంపుతామని అని బెదిరించిన మత చాందసవాదుల మీద క్రైస్తవ సంఘాలు అనుమానం వ్యక్తపరుస్తూ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల పాస్టర్ ఫెలోషిప్, కేసముద్రం మండల క్రిస్టియన్ యూత్ ఫెలోషిప్, వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్, సీపీఐ(ఎం) వివిధ ప్రజాసంఘాలతో నిరసన చేపట్టారు. ఈకార్యక్రమంలో కేసముద్రం మండలం పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు మునిగే జోసెఫ్, సురేష్, మహబూబాబాద్ జిల్లా పాస్టర్ అధ్యక్షులు పిల్లి కుమారస్వామి, మహబూబాబాద్ పాస్టర్స్ ఫెలోషిప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోకి మళ్లీ 'రెవెన్యూ'..!



- వీఆర్‌వో స్థానంలో జీపీవో
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- పూర్వ వీఆర్‌వో, వీఆర్‌ఏలకు అవకాశం

నవతెలంగాణ-తొర్రూర్

గ్రామాల్లో రెవెన్యూ అధికారుల పాలన మళ్లీ అందుబాటులోకి రానుంది. ఆశాఖలో గతంలో క్షేత్రస్థాయిలో కీలకంగా వ్యవహరించిన వీఆర్‌వో, వీఆర్‌ఏల వ్యవస్థను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే తిరిగి వీఆర్‌వో, వీఆర్‌ఏల వ్యవస్థను పునరుద్ధరిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన తరువాత ఆదిశగా చర్యలకు పూనుకుంది. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక అధికారి అందుబాటులో ఉండేలా రాష్ట్ర వ్యాప్తంగా పదివేల 954 గ్రామస్థాయి అధికారి పోస్టులను మంజూరి చేసింది. అయితే వీఆర్‌వో పేరును గ్రామ పరిపాలన అధికారి (జీపీవో)గా పేరు మార్చింది. గత ప్రభుత్వం ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిన వీఆర్‌వో, వీఆర్‌ఏలను వారి వారి ఆప్షన్ల ద్వారా తిరిగి రెవెన్యూ శాఖకు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం జిల్లాకు 508 జీపీవోలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే ఈపోస్టులను ఉగాది నుంచి అమల్లోకి తెస్తుందా? లేక మరింత సమయం పడుతుందా? అనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వ నిర్ణయంపై పూర్వ వీఆర్‌వో, వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇది పరిస్థితి..

రెవెన్యూ శాఖకు సంబంధించి క్షేత్రస్థాయిలో వీఆర్‌వో, వీఆర్‌ఏల వ్యవస్థ గతంలో ఎంతో కీలకంగా వ్యవహరించింది. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, విచారణతో పాటు భూ వ్యవహారాలన్నింటిని వీఆర్‌వోలు పర్యవేక్షించేవారు. గ్రామాలకు సంబంధించి ఏసమాచారమైనా వారి ద్వారానే ఉన్నతాధికారులకు చేరేది. ఇక వీఆర్‌ఏలు గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంతో పాటు గ్రామాలను సందర్శించే ఉన్నతాధికారుల వెంటే ఉండి సహకరించేవారు. అయితే గత టీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020 సెప్టెంబర్‌లో వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేస్తూ అసెంబ్లీ ద్వారా ప్రత్యేక చట్టం తీసుకువచ్చింది. రెండేళ్ల తర్వాత వీఆర్‌వోలుగా పనిచేస్తున్న వారందరిని ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. మరో ఏడాదిపాటు వీఆర్‌ఏలను కొనసాగించిన ప్రభుత్వం ఆగస్టు 3, 2023న వారికి పేస్కేల్ అమలు చేస్తూ వారిని సైతం ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై వీఆర్‌ఏల్లో హర్షం వ్యక్తం అయిన వీఆర్‌వోలు మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇతర శాఖలోకి వెళ్లిన అఇష్టంగానే పనిచేస్తూ రెవెన్యూ పై మక్కువ కనబరిచారు.

వీఆర్‌వోలు ఇక జీపీవోలు

కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారులు ఉండాలని నిర్ణయించింది. రద్దు చేసిన వీఆర్‌వో ఇలా స్థానంలో గ్రామ పాలన అధికారి (జీపీవో)ని తీసుకురావాలని సంకల్పించింది. గత ప్రభుత్వం ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిన పూర్వ వీఆర్వోలు, వీఆర్‌ఏలు రెవెన్యూలో చేరేందుకు ఆసక్తి ఉంటే ఆప్షన్ ఇవ్వాలని ఇటీవల ప్రభుత్వం పేర్కొంది. ప్రభుత్వం నిర్ణయం మేరకు డిగ్రీ అర్హత ఉన్న వారిని మాత్రమే రెవెన్యూకు ఆప్షన్ ఇవ్వాలని కోరారు. ఎక్కువమంది ఇంటర్మీడియట్ వారే ఉండడంతో చాలామంది ప్రస్తుతం ఉన్న శాఖలోనే పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది. జిల్లాలో 280 మంది వీఆర్‌వోలు, 374 మంది వీఆర్‌ఏలను వివిధ శాఖలకు కేటాయించారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం..



గ్రామాల్లోని భూసమస్యలపై, భూ వివరాలపై వీఆర్‌ఏలకు, వీఆర్‌వోలకు పూర్తిపట్టు ఉంది. వీరిని తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకోవడం హర్షనీయం. గత ప్రభుత్వం రద్దుచేసిన రెవెన్యూ వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం పునరుద్ధరించడాన్ని స్వాగతిస్తున్నాం.

-శ్రీనివాస్ వీఆర్ఏ జేఏసీ జిల్లా జనరల్ సెక్రెటరీ, రాష్ట్ర జేఏసీ సభ్యులు

ప్రజలకు మేలు జరుగుతుంది



ప్రభుత్వం తీసుకున్న ఈనిర్ణయం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. 2014లో వీఆర్ఏగా రెవెన్యూలో జాయిన్ అయినాను. 2003 ఆగస్టు 10న మున్సిపాలిటీలో వార్డ్ ఆఫీసర్‌గా జాయిన్ అయినాను. ప్రభుత్వం ఇటీవల గ్రామ రెవెన్యూ అధికారిగా తిరిగి తీసుకోవడానికి తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తున్నాం. ప్రభుత్వం ఇచ్చిన ఆప్షన్లను వినియోగించుకొని తిరిగి రెవెన్యూలోకి వెళ్తాను.

-అనిరెడ్డి మురళీధర్ రెడ్డి, తొర్రూర్ మున్సిపల్ 12వ వార్డు ఆఫీసర్

ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన ఆఫర్‌తో వీరిలో సగం మంది తిరిగి సొంత శాఖ అయిన రెవెన్యూ శాఖకు వచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. మిగతా పోస్టులను ప్రభుత్వం ఏవిధంగా భర్తీ చేస్తుందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

ట్రాఫిక్ పోలీసులకు ప్రశంసలు

- ఫ్లాస్క్‌లను పంపిణీ చేసినఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్

నవతెలంగాణ-మహబూబాబాద్



మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ ఐపీఎస్ ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి ఫ్లాస్క్‌లను పంపిణీ చేసి, వారి అంకితభావాన్ని ప్రశంసించారు. ప్రత్యేకంగా శాలువాతో సన్మానించారు. అండర్ బ్రిడ్జి మూసివేయబడిన సమయంలో రైల్వే గేట్ సమీపంలో ట్రాఫిక్‌ను సమర్థవంతంగా పర్యవేక్షించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సేవలందించిన పోలీసు సిబ్బంది అద్భుతమైన విధి నిర్వహణను ప్రదర్శించారు. వారి సేవలను గుర్తించి, ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ వారికి అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది కష్టపడి పనిచేస్తూ ప్రజా సంక్షేమం కోసం అంకితభావంతో సేవలందిస్తున్నారు. వారి సేవలు అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ తిరుపతిరావు, ఎస్బీ సీఐ చంద్రమౌళి, టౌన్ సీఐ దేవేందర్, ఆర్ఐలు అనిల్, నాగేశ్వర్‌రావులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత

నవతెలంగాణ-మరిపెడ



మనిషి పుట్టింది జీవితం జీవించడానికే, ఆత్మహత్యలకు పాల్పడవద్దని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని కాని ఆత్మహత్యలు చేసుకోవద్దని నివారణ కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ పిలుపునిచ్చారు. బుధవారం మరిపెడ లో ఆత్మహత్యల నివారణ కమిటీ సైకాలజిస్ట్‌ల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణ సదస్సుల కరపత్రాలు, బ్రోచర్లను విడుదల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆత్మహత్యల నివారణ కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ ఆత్మహత్య ప్రయత్నం చేసుకునే వ్యక్తుల పట్ల సమాజం స్వాంతన చేకూర్చి మానసిక ధైర్యాన్ని నింపాలని, తనకి ఎవరూ లేరనే అగాధాన్ని పూడ్చే ప్రయత్నంతో భరోసా నింపాలని, కష్టాల్లో ఉన్న వ్యక్తికి తనకు ఉన్న అన్ని దారులు మూసుకుపోయినప్పుడే ఆత్మహత్య ప్రయత్నం అనే దారి తెరుచుకుంటుందని, ఆప్రమాదకర క్షణంలో మేమున్నామంటూ భరోసానిస్తే బయటపడతారని తెలిపారు. మరిపెడ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాజ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ డాక్టర్ అశోక్ గత పది సంవత్సరాలుగా ఆత్మహత్యల నివారణకు కృషి చేస్తూ ఇప్పటివరకు 28 మంది జీవితాలను కాపాడటం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో మరిపెడ సబ్‌ఇన్స్‌పెక్టర్ సతీష్, సూరత్ తెలంగాణ ఉద్యమకారుడు మచ్చ వీరన్న, భారతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా ఎంపికలు

నవతెలంగాణ-కొత్తగూడ



మండలంలోని స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ మోడల్ క్రీడా పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా ఎంపికలు బుధవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల నుండి మొదటిరోజు 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి ఏటీడీఓ ఆర్.భాస్కర్ రావు పాల్గొని మాట్లాడారు .ప్రభుత్వ పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం, నాణ్యమైన పౌష్టికాహారం, కార్పొరేటర్ స్థాయిలో ప్రభుత్వము విద్యను అందిస్తున్నదదన్నారు. ఈఎంపికలు ఇంకా రెండు రోజులు కొనసాగుతుందని ఈఅవకాశాన్ని ఉమ్మడి జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఐటీడీఏ నోడల్ స్పోర్ట్స్ ఆఫీసర్ శ్యామలత, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ చుంచ కొమ్మాలు , పీఈటీ పీడీలు ఎస్.వెంకన్న ఆర్.రమేష్, ఇ.నాగేశ్వర్‌రావు, టి.వెంకటేశ్వర్లు, జి.లక్ష్మి, కోచ్‌లు ధనాజీ, సుధీర్‌లు పాల్గొన్నారు.



సర్వమతాల సారం ప్రజా హితమే


- కాంగ్రెస్ జిల్లా నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి

నవతెలంగాణ-మరిపెడ

సర్వ మతాల సారం ఒక్కటే అని, అంతా కలిసి మెలసి సుఖ సంతోషాలతో ఉండాలని జిల్లా నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మరిపెడ మున్సిపాలిటీ 9వ వార్డు మాజీ కౌన్సిలర్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో తొమ్మిదో వార్డులోని ఫాతిమా మసీదులో రంజాన్ నెల ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు ఇచ్చిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలోలో కాంగ్రెస్ జిల్లా యువ నాయకులు నూకల అభినవరెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు వేసవిలో కఠోరమైన రంజాన్ ఉపవాస దీక్షలు ఉంటూ భక్తి శ్రద్ధలతో అల్లాను ప్రార్థిస్తుంటారన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే అన్ని వర్గాల సమ్మేళనమని, అన్ని వర్గాల ప్రజలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు షేక్ తాజోద్దీన్, కేసముద్రం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దబోయిన ఐలమల్లు, మైనార్టీ నాయకులు షేక్.ఖలీల్ పాషా, షేక్ ఖాదర్ బాషా, షేక్.అఫ్జల్, మహ్మద్ అఫ్సర్, అజీజ్, సర్వర్, యాకుబ్‌పాషా, కాంగ్రెస్ నాయకులు కొండం దశరథ, పానుగోతు రాంలాల్, గంధసిరి అంబరీష, గుండగాని వెంకన్న, అలువాల ఉపేందర్, భిక్షపతి, నల్లు శ్రీకాంత్‌రెడ్డి, గుండగాని సుందర్, కుడితి నరసింహారెడ్డి, గిరిపురం లింగయ్య, వార్డు నాయకులు కారంపూడి ఉపేందర్, వెంకన్న, జాని, సోమన్న, షేక్ జానీ, యల్లయ్య, షబ్బీర్, లింగయ్య, కొమ్ము భరత్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-గార్ల:



ఎరువుల దుకాణాలలో ఎరువుల వ్యాపారులు నిబంధనలు పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయఅధికారిణి ఎం.విజయనిర్మల స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను బుధవారం ఎవో కె.రామారావుతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎవో విజయనిర్మల షాపులలో రిజిష్టర్‌లు, బిల్లు పుస్తకాలు, ఇన్ వాయిస్ లు, లైసెన్స్‌లు, ఓ ఫారంలు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సక్రమంగా అమలు చేయాలని లేకపోతే ఉపేక్షించబోమని హెచ్చరించారు. రైతులకు ఎరువులు అమ్మేటప్పుడు బిల్లుపై రైతు సంతకం ఉండాలని, అనుమతి ఉన్న ఎరువులనే అమ్మాలని అనుమతి లేని వాటిని, లైసెన్స్ లో ఓ ఫారం పొందు పరచని ఎరువులను అమ్మితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. షాపులో స్టాక్ బోర్డు రైతులకు కనబడే విధంగా అమర్చాలని, గడువు దాటిన ఎరువులు, పురుగు మందులు అమ్మకం జరిపినట్లు ఫిర్యాదు వస్తే లైసెన్స్ రద్దు చేస్తామని, రైతులకు ఆధార్ కార్డు ద్వారా ఈ-పాస్ మెషీన్ నుంచే ఎరువులు అమ్మాలని, తనిఖీకి వచ్చినప్పుడు ఈ-పాస్ మిషిన్‌లో ఉన్న నిల్వ, గోడౌన్ నిల్వ రిజిస్టర్ లో ఉన్న స్టాక్స్‌తో సరిపోవాలని సూచించారు.

నవోదయకు 'విశ్వదీప్తి' విద్యార్థులు ఎంపిక

పాఠశాల కరస్పాండెంట్ ఎంకె సుదర్శన్

నవతెలంగాణ-మల్హర్ రావు



మండలంలోని కొయ్యూర్ గ్రామపంచాయతీ పరిధిలోగల విశ్వదీప్తి ఇంగ్లీష్ మీడియం ప్రయివేటు పాఠశాలలో నర్సరీ నుంచి 5వ తరగతి చదువుతున్న డి శరణ్య, జి సాయి మణి దీపిక విద్యార్థులు ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష రాశారు. ఈ ఎంట్రన్స్ ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో శరణ్య,సాయి మనిదిపికలు అర్హత సాధించి,ఆరోవ తరగతికి ఎంపికైనట్లుగా పాఠశాల కరస్పాండెంట్ ఎంకె సదర్శన్ తెలిపారు. వారి ఎంపిక పట్ల పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

ఆదివాసి గూడెంలో ఘనంగా వనభోజనాల పండుగ

నవతెలంగాణ -తాడ్వాయి



మండలంలోని లింగాల గ్రామపంచాయతీ పరిధి 'కొడిశల' ఆదివాసి గ్రామంలో వన భోజనాల పండుగ బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పొలిమేరలో ఉన్న అటవీ ప్రాంతంలో విడిది చేశారు. ఆదివాసి సాంప్రదాయాల ప్రకారం మొదట గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అడవి ప్రాంతంలోని చెట్టు వద్ద గ్రామంలోని వారందరూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వంట వార్పు చేసుకుని గ్రామంలోని గ్రామస్తులు, మహిళలు, ప్రజలందరూ కలిసి సహపంక్తి భోజనాలు ఆరగించారు.

అన్ని సౌకర్యాలు కల్పించాలి

అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి

నవతెలంగాణ-మహదేవపూర్

అన్ని సౌకర్యాలు కల్పించాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. మహదేవపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ కింద ఈ ఆర్థిక సంవత్సరంలో టార్గెట్ మేరకు అన్ని గ్రామపంచాయతీలో కూలీలకు ఉపాధి కల్పించి మార్చి 31 లోగా నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కూలీల దినసరి వేతనం రూ.300 లభించేటట్లు మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు కొలతల ప్రకారం పని చేయించాలని సూచించారు. ప్రస్తుతం వేసవికాలం ప్రారంభమై ఎండలు తీవ్రత ఉన్నందున పంచాయతీ కార్యదర్శులు పని ప్రదేశంలో కూలీలకు నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని అన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం పంచాయతీరాజ్ శాఖ పై సమీక్ష చేశారు. గ్రామపంచాయతీలలో నిర్దేశించిన లక్ష్యం మేరకు రాబోయే నాలుగు రోజుల్లో ఇంటి పన్నులు 100శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్య ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించిచారు. మెట్పల్లి, మహదేవపూర్, కాలేశ్వరంలో ఎల్ఆర్ఎస్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెలాఖరులోగా రుసుము చెల్లిస్తే 25శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. నూతన రేషన్ కార్డు కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను మొబైల్ యాప్ ద్వారా పరిశీలన చేయాలని అన్నారు. సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారి మహదేవపూర్ మండల ప్రత్యేక అధికారి ఎం వీరభద్రయ్య, ఎంపీడీవో వెంక టేశ్వర్లు ఎంపీఓ, ఏ ప్రసాద్, తాసిల్దార్ ప్రహ్లాద రాథోడ్, అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్, ఆర్డబ్ల్యూఎస్ ఉపాధి హామీ ఏపీఓ రమేష్, అన్ని గ్రామ పం చాయతీల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంకు జాతీయ నాణ్యత ఆరోగ్య ప్రమాణాల సర్టిఫికెట్ గుర్తింపు

నవతెలంగాణ-మహదేవపూర్

మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి బ్రాహ్మణపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంకు నేషనల్ క్వాలిటీ అస్యు రెన్స్ స్టాండెడ్ సర్టిఫికెట్ 89.98శాతంతో గుర్తింపు ఇవ్వటం జరిగిందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుస్మిత తెలిపారు. బుధవారం జిల్లా అధికారులు జాతీయ నాణ్యత ఆరోగ్య ప్రమాణాల సర్టిఫికెట్‌కోసం సమావేశం నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫసర్స్ డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ప్రమోద్ డీపీవో చిరంజీవి, డాక్టర్ ఆశ లత డాక్టర్ సందీప్ ఎమ్ఎల్‌హెచ్‌పి డాక్టర్స్ మమత, హరిణి,గీత, అస్మా, డీడీఎం మధు, జిల్లా యన్ సీపీబీడీసీ, ఎన్‌యల్ఈపి, ఎన్‌టిపి అధికారులు రమేష్, మల్లయ్య, అమర్, రమేష్,ల తదితర అధికారులు, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం లో ఎన్‌హెచ్ఎస్ఆర్‌సి, ఎన్ఆర్యం ఇండియా అధికారులు మార్చి 10న వర్చువల్‌గా ఆరోగ్య ప్రమానాలు, పబ్లిక్ హెల్త్ స్కీం ఫెసిలిటీ ని పరిశీలించి జాతీయ ఆరోగ్య వ్యవస్థల వనరుల కేంద్రం, జాతీయ హెల్త్ మిషన్ మినిస్ట్రీ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవెర్నమెంట్ అఫ్ ఇండియా వారు సర్టిఫికెట్ అందించినట్టు వారె తెలిపారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావద్దు

ఎస్సై రేఖ అశోక్

నవతెలంగాణ-గణపురం

యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని చదువుపై దృష్టి సారించాలని ఎస్సై రేఖ అశోక్ అన్నారు. బుధవారం గాంధీనగర్ గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామస్తులతో మాట్లాడారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై శ్రద్ధ వహించి జీవితంలో ఉన్నత స్థాయిలో ఉండాలని కోరారు. తల్లిదండ్రులు కూడా వారి పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. గ్రామంలో ఎవరైనా ఇతరులను రెచ్చగొట్టే విధంగా గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వాట్సాప్ గ్రూప్ లలో ప్రచారం చేసినా చర్యలు తప్పవన్నారు. గ్రూపు అడ్మిన్ లదే బాధ్యత అన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి గ్రామస్తులు అందరూ సహకరించాలన్నారు. గ్రామస్తులకు ఏ సమస్య వచ్చినా నేరుగా పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, లేదంటే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలన్నారు. చట్టాన్ని చేతిలోకి తీసుకొని ఎవరైనా ప్రవర్తించినట్లయితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

గో సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

తెలంగాణ గోసేవ విభాగం ఇంచార్జ్ జగన్మోహన్ చారి

నవతెలంగాణ-గణపురం

గో సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలనితెలంగాణ గోసేవ విభాగం ఇంచార్జ్ జగన్మోహన్ చారి భూపాలపల్లి, ములుగు గో సేవ ఇంచార్జ్ బెల్లపుకొండ సదాశివరెడ్డి అన్నారు. బుధవారం కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ ప్రాంగణంలోని గోశాలను వారు సందర్శించారు. గోశాల నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. గోసంరక్షణలో భాగంగా మండలంలోని పరుశురాంపల్లి రైతులతో సమావేశం నిర్వహించిన అనంతరం కోటగుళ్ళు గోశాలను సందర్శించడం జరిగిందన్నారు. మానవాళికి ఎంతో మేలు చేసే గోవులను ప్రతి ఇంటిలోనూ బాధ్యతగా పెంచాలన్నారు. ముఖ్యంగా గోవులు కభేలాలకు తరలకుండా అక్రమ రవాణాను నియంత్రించాలన్నారు. ప్రతి గ్రామంలో గోరక్షక బృందాలను తయారు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గో సంరక్షణపై గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. వారి వెంట రైతు తిరుపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

అవగాహన కలిగి ఉండాలి : సీఐ శంకర్

నవతెలంగాణ-ములుగు

మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలతో కలిగే నష్టాలతోపాటు ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ క్లబ్ లపై బండారుపల్లి జాకారం గ్రామ ప్రజలకు ములుగు సిఐ వి శంకర్ అవగాహన కల్పించారు. ములుగు మండలం లోని బండారుపల్లి, జాకారం గ్రామములలో ములుగు పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం బుధవారం నిర్వహించారు. బండారుపల్లి, జాకారంలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ అవేర్నెస్ కమిటీ, ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ క్లబ్,రోడ్ సేఫ్టీ క్లబ్లలో ఉన్న సభ్యులు నిర్వర్తించాల్సిన బాధ్యతను వివరించారు. ములుగు ఎస్సై సిహెచ్ వెంకటేశ్వరావు పాల్గొని గ్రామంలో యాంటీ డ్రగ్ అవేర్నెస్ కమిటీ, ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ క్లబ్,రోడ్ సేఫ్టీ క్లబ్, రోడ్డు సేఫ్టీ కమిటీ లో ప్రజలను సభ్యులుగా చేర్చారు. ఫోక్సో ఆక్ట్, ఎస్సీ,ఎస్టీ, ఆక్ట్ గురించి అవగాహన కల్పించారు. సీసీ కెమెరాల ఆవశ్యకత వివరించారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావాలని కోరారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య పరామర్శ

నవతెలంగాణ - ములుగు

ములుగు మండలం పంచోత్కులపల్లి గ్రామానికి చెందిన దేవరనేని రాధమ్మ అనారోగ్య కారణంగా బుధవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క తనయుడు యూత్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దనసరి సూర్య ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉం టుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, యూత్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి నేపాల్ రావు,మండల యూత్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బండి మధు,గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

నవతెలంగాణ-గణపురం



పరీక్షలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం గణపురం మండలం చెల్బూర్ జడ్పిఎస్ఎస్, అలాగే మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో జరుగుతున్న 10వ తరగతి రీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. కలెక్టర్ అన్ని గదులను పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, వైద్య తదితర మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణ పైన చీఫ్ సూపరింటెడెంట్లకు పలు సూచనలు చేశారు. పరీక్షలకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారనే వివరాలు, పరీక్షా కేంద్రాలోని ఏర్పాట్లును పరిశీలించారు. పరీక్షల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన రికార్డులను, ప్రశ్న పత్రాలు, పరీక్షల అనంతరం జవాబు పత్రాల తరలింపుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 21వ తేదీ నుండి ప్రారంభమైన 10వ తరగతి పరిక్షలు ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, తదుపరి జరుగనున్న పరీక్షలు కూడా ఇదే స్ఫూర్తితో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్‌కు పాల్పడితే మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పరీక్షలు ముగిసేంత వరకు అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రశ్నపత్రాలను తప్పనిసరిగా తగిన పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య క్లోస్డ్ వాహనంలో తరలించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్య నారాయణ స్వామి, చీఫ్ సూపరింటెండెట్స్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జరిగే ధర్నాను విజయవంతం చేయాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు

నవతెలంగాణ-భూపాలపల్లి



ప్రజా సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నా విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రామిక భవనంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 12 మండలాలలోని పలు గ్రామాలలో ప్రజా స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. డబల్ బెడ్ రూమ్‌లు పంపిణీ చేయాలని, కేటాయించిన డబల్ బెడ్‌రూమ్‌లో సౌకర్యాలు కల్పించాలన్నారు. వేసవిలో యుద్ధ ప్రాతిపదికన ట్యాంకర్ల ద్వారా మంచినీటి కొరత ఉన్న గ్రామాలకు నీరు అందించాలన్నారు. పలిమెల, ముత్తారం, కాటారం, మహదేవాపూర్, మలహర్రావు మండల కేంద్రాల్లో ఇండ్లకు పట్టాలనిదించాలన్నారు. పోడు భూములకు పట్టాలివ్వాలని, తునికాకు బోనస్ అందించాలని కోరారు. సింగరేణి, జెన్ కో, మేడిగడ్డ, అన్నారం పరిశ్రమలో ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన నిర్వాసితులందరికీ నష్టపరిహారం అందించాలన్నారు. దుబ్బపల్లి, కాపురం , గడ్డిగానిపెల్లి గ్రామాలను తరలించి ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ కింద ఇండ్ల నిర్మాణం చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని పాత ఎర్ర చెరువులో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇంటి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వివిధ కాలనీలో ఉన్న పెండింగ్ ఇంటి పట్టాలు మంజూరు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో బీఈడీ, లా కాలేజీ, ఇంజినీరింగ్ కాలేజీలు ఏర్పాటు చేయాలని అన్నారు. పోడు భూములు దున్నుకోవడానికి ట్రాక్టర్లకు అనుమతించాలన్నారు. ఫారెస్ట్ అధికారుల దాడులు నిలిపివేయాలని అన్నారు. జిల్లాలో ఉన్న ఉపాధి కూలీ పెండింగ్ డబ్బులు చెల్లించాలన్నారు. జిల్లా ప్రజల చిరకాల కోరిక రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని,. కోతులు, కుక్కల బెడత నుండి ప్రజల్ని రక్షించాలన్నారు. జిల్లాలో ఇండ్లు లేని పేదలందరినీ గుర్తించి ప్రభుత్వ భూముల్ని ఇంటి స్థలం కోసం కేటాయించాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని పేద రైతులకు సాగు చేసుకోవడానికి ఇవ్వాలన్నారు. ఇళ్ల స్థలాలు లేని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లపై జరిగే ధర్నాకు పార్టీ రాష్ట్ర నాయకులు జే వెంకటేష్ హాజరవుతున్నారని అన్నారు. జిల్లాలోని ప్రజలందరూ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు పోలం రాజేందర్, కె.రాజయ్య, రజాక్, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతి పట్ల కొవ్వొత్తుల ప్రదర్శన

నవతెలంగాణ మహదేవపూర్



ఇటీవల అనుమానాస్పదంగా మృతిచెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పట్ల గారేపల్లి అంబేద్కర్ చౌక్ వద్ద బుధవారం క్యాండిల్ లైట్ ప్రదర్శన చేపట్టారు. కాటారం డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్ డేవిడ్ మార్క్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతి క్రైస్తవులకు తీరని లోటని చెప్పారు. వారి మరణం చుట్టూ ఉన్న అనుమానాలను ప్రభుత్వం విచారణ చేసి సంఘ విద్రోహ శక్తులు ఎవరైనా ఉంటే కఠినంగా శిక్షించి క్రైస్తవులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పాస్టర్ కమిటీ సభ్యులు పాస్టర్లు డేవిడ్ మార్క్, బన్సిలాల్, ప్రకాష్, ఐజాక్, జీవరత్నం,దానియేలు, బ్రదర్ ప్రభుదాస్, ఆయా మండలాల పాస్టర్ల కమిటీ ప్రెసిడెంట్‌లు, సంఘ పెద్దలు, యువత పాల్గొన్నారు.

సమర్థవంతమైన వ్యవస్థలు ఏర్పాటు చేయాలి

ఎన్సీఈఆర్టీ జాతీయ కౌమార విద్యా సదస్సులో డాక్టర్ కందాల రామయ్య

నవతెలంగాణ - ములుగు





కౌమార దశ బాలబాలికల సమగ్ర అభివృద్ధి కోసం సమర్థవంతమైన వ్యవ స్థలను ఏర్పాటు చేయాలని అబ్బాపూర్ గణిత ఉపాధ్యాయుడు, ప్రఖ్యాత మనో వైజ్ఞానిశాస్త్ర పరిశోధకుడు, రిసోర్స్ పర్సన్, ఎన్సీఈటీఈ జాతీయ మెంటర్ డాక్టర్ కందాల రామయ్య అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లా డారు. భోపాల్‌లో 'వికసిత్ భారత్ కోసం కౌమార విద్య, సమస్యలు, సవాళ్లు, పరిష్కారాలు' అనే అశంపై నిర్వహించిన ఎన్సీఈఆర్టీ జాతీయ కౌమార విద్యా సదస్సులో మార్చి 24,25 తేదీల్లో పాల్గొన్నట్టు చెప్పారు. కౌమారదశలో బాలికలు ఒత్తిడిని ఎదుర్కొనే విధానాలపై పరిశోధన పత్రాన్ని సమర్పించామన్నారు. దేశంలోని ప్రతి విద్యా సంస్థలో మార్గదర్శక , కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి , కౌన్సిలర్ లనునియమించాలన్నారు. కౌమారదశ పిల్లల సమగ్ర అభివృద్ధి కోసం తగిన బడ్జెట్ కేటాయింపులు, వనరులను అందించాలని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం -202 ఆమమలులో భాగంగా ఉన్నత పాఠశాల, కాలేజీ స్థాయిలో వృత్తి, నైపుణ్య విద్యకు ప్రాధాన్యత ఇస్తూ, తగిన కోర్సులను రూపకల్పన చేసి, వచ్చే విద్యసంవత్సరం నుండి అమలు చేయాలని కోరారు. డాక్టర్ రామయ్య చేసిన గొప్ప ప్రదర్శన, కౌమార బాలబాలికల అభివృద్ధి కోసం చేసిన సిఫార్సులను ఆర్ఐఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జయదేవ్ మోండల్, ముఖ్య అతిథి ప్రొఫెసర్ బుర్రా రమేష్ బాబు, సదస్సు సమన్వయకర్త ప్రొఫెసర్ రష్మి సింగ్ ప్రశంసించి ప్రశంసా పత్రాన్ని అందించినట్టు చెప్పారు. జాతీయ సదస్సులో తెలంగాణ రాష్ట్రం తరపున డాక్టర్ కందాల రామయ్య ప్రతినిధ్యాన్ని నిర్వహించడం గర్వించదగిన విషయమని పలువురు పేర్కొంటున్నారు.

బీసీని ముఖ్యమంత్రి చేసేవరకు పోరాటం

ప్రజాసేన వ్యవస్థాపకులు బొమ్మకంటి రమేష్ వర్మ

నవతెలంగాణ - ములుగు

తెలంగాణలో బీసిని ముఖ్యమంత్రి చేయడం కోసం తెలంగాణ ప్రజాసేన పనిచేస్తుందని తెలంగాణ ప్రజాసేన వ్యవస్థాపకులు బొమ్మకంటి రమేష్ వర్మ అన్నారు. బుధవారం రమేష్ వర్మ విలేకరులతో మాట్లాడుతూ 2022 లో సోమా జిగూడ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ ప్రజాసేన స్థాపించి బీసీని ముఖ్యమంత్రి చేయ డం ప్రధాన ఎజెండాగా పెట్టడం జరిగిందని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఒక్క బీసీకి ముఖ్యమంత్రి స్థానం కల్పించకపోవడం బాధాకరమన్నారు. బీసీలు వెనుకబడిపోయి ఉన్నారని, భారత రాజ్యాంగం ప్రకారం అందరికీ సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ జనాభా శాతం ఎక్కువగా ఉన్నదని, వారికీ సరైన అవకాశా లు కల్పించడం లేదన్నారు. రానున్న రోజుల్లో బీసీని ముఖ్య మంత్రి చేయడం కోసం పోరాడటం జరుగు తుందన్నారు. ఈ విషయంలో బీసీలను ఐక్యం చేయడం జరుగుతుందని, బీసీలు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. అయన వెంట రాష్ట్ర నాయకులు నిషాని శంకరయ్య (అడ్వకేట్), ఐలు కవిత (అడ్వకేట్), వడ్డేపల్లి శ్యామ్ (అడ్వకేట్), ఉమారాణి, కవిత, శిరీష, రొంటాల జనార్ధన్, పిడిశెట్టి రాజు, ఉప్పరి రామ చందర్ (అడ్వకేట్), రఘు తదితరులు ఉన్నారు.

నేడు జై బాపు, జై బిమ్, జై సంవిధన్ అభియాన్

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితేల రాజయ్య

నవతెలంగాణ-మల్హర్‌రావు

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు నేడు మండల కేంద్రమైన తాడిచెర్లలోని హనుమాన్ చౌరస్తాలో మధ్యాహ్నం 3.30 గంటలకు జై బాపు,జై భీమ్,జై సంవిధన్ అభియాన్ సన్నాహక సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ముఖ్యఅధితులుగా తెలంగాణ రాష్ట్ర సహకార ఆయిల్, సీడ్స్, ఉత్పత్తిదారుల కార్పొరేషన్ చైర్మన్, కార్యక్రమ కోఆర్డినేటర్ జంగా రాఘవరెడ్డి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు పాల్గొంటారని, కావున కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల నాయకులు,యువత,మహిళ నాయకురాలు హాజరై విజయవంతం చేయాలని కాంగ్రెఅ పార్టీ మండల అధ్యక్షుడు బడితేల రాజయ్య, మహదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోట రాజబాబు బుధవారం ప్రకటనలో కోరారు.

వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-మహదేవపూర్

మండలంలో ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముస్లిం హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ముజాహిద్ ఖాన్ కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్లో వినతి పత్రాన్ని అందించినట్లు బుధవారం ఆయన తెలిపారు. గత ఆదివారం రాత్రి ముస్లిం మైనారిటీలకు సంబంధించిన ఖబ్రస్తాన్ ప్రహరీ గోడ మినార్లను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసి నట్లు తెలిపారు. ఈ ఘటనపై లోతుగా విచారించి దీని వెనుక ఉన్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఇకముందు ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృ తం కాకుండా చర్యలు చేపట్టాలని ఎస్సై పవన్ కుమార్‌ను కోరారు.

ధాన్యం కొనుగోలు సక్రమంగా చేపట్టాలి

● అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ

నవతెలంగాణ -తాడ్వాయి



రబీ(యాసంగి) 2024-25 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల నిర్వహణ సక్ర మంగా చేపట్టాలని ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో జిల్లా పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, వ్యవసాయ విస్తరణ అధికారులు వరి కోత యంత్రాల యజమానులు, పిఎసిఎస్ చైర్మన్లు రైతుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధికారులతో అవగా హన సదస్సు, ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. తేమ శాతం 17 లోపు ఉండే విధంగా చూడా లన్నారు. రికార్డులు ఎలా నిర్వహణ చేపట్టాలి, కేంద్రాల్లో కొన్న ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లర్లకు తరలించడం ఎలా వంటి తదితర అంశాలపై అవగాహన కల్పిం చారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎవరైనా పొరపాటు చేసినట్లు మా దృష్టికి వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎండల్లో పనులు చేసి వడదెబ్బకు గురికాకూడదని తెలిపారు. ఉదయం సాయంత్రం సమయాల్లో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాసిల్దార్ జె సురేష్ బాబు, జిల్లా పౌర సరఫరాల అధికారి ఫైసల్ హుస్సేన్, మేనేజర్ రామ్‌పతి, డీసీఓ సర్దార్ సింగ్, డీపీఎం చౌహన్, తాడ్వాయి వ్యవసాయశాఖ అధికారి కుమార్‌యాదవ్, తాడ్వా యి, గోవిందరావుపేట మండలాల వ్యవసాయశాఖ అధికారులు, విస్తరణాధికా రులు, డీటీలు, సంఘం సీఈవోలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, వరి కోత యంత్రాల యజమానులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో గోల్కొండ రిత్విక్ ప్రతిభ

నవతెలంగాణ-మహదేవపూర్



నవోదయ 2025-26 ఫలితాల్లో మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన గుడ్ మార్నింగ్ స్కూల్ విద్యార్థి గోల్కొండ రిత్విక్ ప్రతిభ చాటాడు. చిన్నతనం నుండే చదువుపై శ్రద్ధ చూపిస్తూ నవోదయ పరీక్ష ఫలితాల్లో ఎంపిక కావడం పట్ల కరస్పాండెంట్ ఎంఎం శశి, హెచ్ఎం, ఉపాధ్యాయులు, పలువురు అభినందించారు.

ఘనంగా మెపా క్యాలెండర్ ఆవిష్కరణ

జాతి సిద్ధాంతం కోసం పని చేయాలి

మెపా జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్ ముదిరాజ్

నవతెలంగాణ - ములుగు

ములుగు జిల్లా కేంద్రంలోని మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల నాగరాజు ముదిరాజ్ అధ్వర్యంలో ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం మెపా క్యాలెండర్ ఆవిష్కరించారు. మెపా జిల్లా అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు అచ్చునూరి కిషన్ ముదిరాజ్, బండి రాజు ముదిరాజ్ హాజరై మాట్లాడారు. మెపా వ్యవస్థాపక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ఆదేశానుసారం ముదిరాజ్ మహనీయుల ఆశయాలను కొనసాగించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో లో ప్రకటించిన ముదిరాజ్‌ల రిజర్వేషన్ అంశాన్ని పరిష్కరించాలని కోరారు. రాష్ట్రం లో వివిధ రాజకీయ పార్టీలలో ఉన్న ముదిరాజ్‌లు హక్కుల సాధనకు ఏకతాటిపైకి రావాలని కోరారు. మెపా రాష్ట్ర కార్యదర్శి సింగరాపు రామకృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ.. విద్యా, ఉద్యోగ, సాధికారత కోసం మెపా కృషి చేస్తుందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఐక్యంగా కలిసి పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహా సభ జిల్లా అధ్యక్షుడు ఏర్ల వెంకన్న ముదిరాజ్, మెపా ములుగు జిల్లా ఉపాధ్యక్షుడు భూమ నరేష్ ముదిరాజ్, వెంకటాపూర్ మండల అధ్యక్షుడు మేకల రమేష్ ముదిరాజ్, అబ్బాపూర్ మాజీ సర్పంచ్ గండి కుమార్ ముదిరాజ్, ఇంచర్ల మాజీ సర్పంచ్ మోర రాజయ్య ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన రైతుల క్షేత్రస్థాయి పర్యటన

నవతెలంగాణ -తాడ్వాయి

ములుగు జిల్లా తాడ్వాయి మండలానికి చెందిన రైతులు గత రెండు రోజుల నుండి పివి నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీ - మత్స పరిశో ధన కేంద్రం, ములుగు జిల్లా మత్సశాఖ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌లో చేపల పెంపకం పై పర్యటిస్తున్నారు. యూని వర్సిటీ శాస్త్రవేత్త రవీందర్ క్షేత్ర పర్యటన లో గిరిజన మత్స కారులకు రైతుల కు వివిధ రకాల పెంపకం గురించి అవగాహన కల్పించారు. మిశ్రమ వ్యవ సాయం కోళ్లు, గేదలతో పాటు చేపల పెంపకం గురించి వివిధ రకాల రైతు ల వ్యవసాయం క్షేత్రం లోని చెరువులు గురించి వివరించారు. ఈ కార్య క్రమం లో సిద్దబోయిన సురేందర్, చేర్ప రవీందర్, చర్ప చంద్ర శేకర్, వజ్జ నరేందర్, యాళం విక్రమ్, పాయం నవీన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ ములుగు, వెంకటాపూర్ మండలశాఖల కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ - ములుగు

డీటీఫ్ ములుగు,వెంకటాపూర్ మండలాలశాఖ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ములుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల శాఖల సమావేశం బుధవారం జి కనకరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు గన్ రెడ్డి ఆదిరెడ్డి హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో డీటిఎఫ్ రాజిలేని పోరాటాలు నిర్వహించిందన్నారు. దాన్ని నిలబెట్టుకోవడానికి మనమంతా నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టో లో ప్రకటించిన విధంగా పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తూ, పెండింగ్ 5 డీఏలను ప్రకటించి, పిఆర్సీ అమలు చేయాలని కోరారు. అనంతరం నూతన మండల శాఖలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ములుగు మండలశాఖ అధ్యక్షులుగా కనకరాజు, ప్రధాన కార్యదర్శిగా హనుమాన్, ఉపాధ్యక్షులుగా కుంజ పమిడయ్య, అశోక్, కార్యదర్శులుగా ఎండి ఖలీల్, ఏం పాపయ్య,జిల్లా కౌన్సిలర్లుగా గన్‌రెడ్డి ఆదిరెడ్డి, ఎన్ రఘుశర్మ ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎన్ రాజు, సభ్యులుగా ఏం వేంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. వెంకటాపూర్ మండలశాఖ కన్వీనర్‌గా బి అనిత, కో కన్వీనర్‌గా ఎండి ఫెరోజ్ ఎన్నికయ్యారు.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు

నవతెలంగాణ-వెంకటాపురం

ఇప్పగూడెం గోదావరి నదిలో అక్రమంగా కంకరతో రోడ్డు నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని వరంగల్ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి హరిప్రసాద్‌కు దాచేపల్లి సూర్య కుమారి, దూడ సుదర్శన్ రెడ్డి విన్నవించారు. బుధవారం అధికార పర్యటనకు వచ్చిన ఆయనను అలుబాక రీచ్ వద్ద వారు కలిసి మాట్లాడారు. నెల రోజులుగా ఇప్పగూడెం(జెడ్) సర్వే నెంబర్లు 25,26,27 సంబంధించిన వ్యక్తులు ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా కంకరను గోదావరిలో సుమారు నాలుగు కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి లక్షలాది క్యూబిక్ మీటర్ల కంకరను ప్రభుత్వ భూములు నుండి తరలించినా మైనింగ్ శాఖ పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రజావాణిలో జిల్లా మైనింగ్ అధికారి దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ చర్యలకు పూనుకోలేదని విమర్శించారు. రామచంద్రాపురం గ్రామస్తులు గొంది రమణయ్య, కుంజా ముత్తయ్య, సుభద్ర, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాల పండగ

-ఘనంగా పెద్ద పట్నం

నవతెలంగాణ-పర్వతగిరి



మండలంలోని చింతనెక్కొండలో బుధవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆట పాటలతో మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకుని నృత్యాలు చేస్తూ పోచమ్మ ఆలయానికి తీసుకువచ్చి మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం పెద్ద పట్నం వేసి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి ఓరుగంటి శ్రీనివాస్, యాదవ సంఘం కులపెద్ద వంగ దేవేందర్, మాజీ ఎంపీటీసీకాట్రోజు మౌనిక రాజు,శ్రీకృష్ణ యాదవ పరపతి సంఘం వ్యవస్థాపకులు వేల్పుల రాజు, గౌరవ అధ్యక్షులు ఐరబోయిన రమేష్, అధ్యక్షులు బండి అశోక్, ఉపాధ్యక్షులు స్వామి,ప్రధాన కార్యదర్శి గండ్రకోట సాంబరాజ్, శ్రీశైలం, విజేందర్, మారబోయిన శివకుమార్, ఐ.అశోక్, పనికర రాజు,గాదుడుల అశోక్,మల్లిఖార్జున, యాదవులు,మహిళలు పాల్గొన్నారు.



ఐరన్ విద్యుత్ స్తంభాలు తొలగించాలి

నవతెలంగాణ-నెక్కొండ

నెక్కొండ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుండి అండర్ బ్రిడ్జి వరకు ఉన్న విద్యుత్ ఐరన్ స్తంభాలను తొలగించి సిమెంట్ స్తంభాలను అమర్చాలని విద్యుత్ ఏడిఈ శ్రీధర్‌ను బుధవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఈదునూరి వెంకన్న కలిసి వినతిపత్రం అందించారు. వర్షకాలంలో విద్యుత్ ప్రమాదాలు వాటిల్లకుండా ఉండాలంటే ఐరన్ స్తంభాలను తొలగించడం అనివార్యమని,శ్రీ ఆదర్శ నగర్ కొంకాల సాయిలు ఇంటిముందు గల నడిరోడ్డులోని విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కోరారు.కార్యక్రమంలో చిందు హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు గడ్డం రమేష్, ఎంఆర్పిఎస్ మండల నాయకులు జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. వెంటనే స్పందించిన ఏడిఈ విచారణ చేసి స్తంభాల పునరుద్ధరణకు చర్యలు చేపడతామని హామీనిచినట్లు చెప్పారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని చెరువుకొమ్ము తండా కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బావుసింగ్ సోదరుడు మరణించగా బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్‌నాయక్ మృతుని కుటుంబ సభ్యులకు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు బావుసింగ్ నాయక్,బూత్ కన్వీనర్ రమేష్ నాయక్, నాయకులు మోహన్, రాజు, రమేష్ ఉన్నారు.



మంద కుమార్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-వర్ధన్నపేట

ఎస్సీ వర్గీకరణ కోసం 30ఏండ్లుగా మందకృష్ణమాదిగతో పాటు పోరాడిన మంద కుమార్ మాదిగను బుధవారం మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బుధవారం మంద కుమార్ మాదిగ గృహంలో జన్ను రాములు సన్మానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో (మాస్) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములుతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు మరుపట్ల అంజయ్య నాయకులు తుళ్ల అనిల్, చెన్న రాజు, తుమ్మల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ఇంటర్మీడియట్‌కు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నెక్కొండ

తెలంగాణ రాష్ట్రంలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలల్లోని ఇంటర్మీడియట్లో ప్రవేశాల కోసం ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నెక్కొండ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని 35 గురుకుల పాఠశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపిసి, ఎంఈసి గ్రూపుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆన్లైన్లో ఏప్రిల్ 23వరకు దరఖాస్తు చేసుకోవాలని, మే 10న ఉమ్మడి ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు.

శానిటేషన్‌లో పిన్ పాయింట్ ప్రోగ్రాంను అమలు చేయాలి

బల్దియా కమిషనర్

డాక్టర్ అశ్విని తానాజీ వాకడే

నవతెలంగాణ-వరంగల్



సమర్ధ శానిటేషన్ నిర్వహణలో భాగంగా శానిటే షన్ అధికారులు సిబ్బంది పిన్ పాయింట్ ప్రోగ్రాంను అమలు చేయాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ నగర పరిధి 61వ డివిజన్ సిద్ధార్థ నగర్‌లో బుధవారం కమిషనర్ సానిటేషన్‌తో పాటు ట్రేడ్, ఆస్తి పన్నుల వసూళ్ల తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శానిటేషన్ పిన్ పాయింట్ ప్రోగ్రాంను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించిన జవాన్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. శానిటరీ ఇన్స్పెక్టర్‌లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి వార్డులో పిన్ పాయింట్ ప్రోగ్రాం అమలు అయ్యేలా చూడాలని, పారిశుధ్య సిబ్బంది స్వీపింగ్, డ్రైన్ క్లీనింగ్‌లకు చెందిన లాగ్‌బుక్ కచ్చితంగా నిర్వహించేలా చూడాలని, సమయ పాలన పాటించాలని, ప్రతి చెత్త తరలింపు వాహనం రెండు ట్రిపులు వేయాలని సూచించారు. ఆస్తి, ట్రేడ్ పన్ను వసూళ్లకు ఏర్పాటు చేసిన బృందాలు ఖాజీపేట పరిధిలో 6బృందాలు, కాశీబుగ్గ పరిధిలో ఏర్పాటు చేసిన 5బృందాలు ప్రతి రోజు రూ.50లక్షల చొప్పున ఆస్తి, ట్రేడ్ పన్నులు వసూళ్లు జరుపుతూ, దానికి సమాంత రంగా శానిటేషన్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. సిద్ధార్థ నగర్‌లో రోడ్డు మీద ఇసుక వేసి నిర్మాణం చేస్తున్న యజమానికి పెనాల్టీ విధించాలని కమిషనర్ సిఎం హెచ్ఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఎం హెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి శానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటిఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

వన్ టైం సెటిల్మెంట్(ఓటిఎస్) స్కీమ్ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకొని పన్నుపై 90 శాతం వడ్డీ మాఫీ పొందాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి చెందిన ఆస్తి పన్ను బకాయిల మొత్తాన్ని చెల్లిస్తే, ఆస్తి పన్నుపై 90శాతం పేరుకుపోయిన బకాయి వడ్డీని మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025 మార్చి 31 వరకు వడ్డీ, పెనాల్టీలతో సహా మొత్తం ఆస్తి పన్ను బకాయిలను ఒకేసారి చెల్లించిన పన్ను చెల్లింపు దారులకు సంబంధించి, బకాయిలపై 90శాతం వడ్డీ/పెనాల్టీలను మాఫీ చేయడం జరుగుతుందని, ఇదివరకే పన్నులు చెల్లించిన వారికి భవిష్యత్తు చెల్లింపులతో సర్దుబాటు చేయాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొనడం జరిగిందని, ఈ సువర్ణా వకాశం కేవలం 4రోజులు మాత్రమే వర్తి స్తుందని, ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

ఘనంగా కొండా సుస్మిత జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కాశిబుగ్గ



రాష్ట్ర అటవి పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ- మురళీధర్‌రావు దంపతులకు కూతురు, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కొండా సుస్మిత పటేల్ జన్మదిన వేడుకలను బుధవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఖిలా వరంగల్‌లో 37వ డివిజన్ అధ్యక్షుడు బోయిన దూడయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్. భోగి సువర్ణసురేష్ హాజరై మాట్లాడుతూ కొండా దంపతుల వారసురాలిగా ప్రజల్లోకి వచ్చిన సుస్మిత పటేల్ అనునిత్యం పేదల కోసం ఆలోచిస్తారని, నిరుద్యోగుల కోసం ఏప్రిల్ 11న జాబ్‌మేళా నిర్వహించి వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కొండా సుస్మిత పటేల్ ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వేడిగా వీరన్న, చందర్, శ్రీనివాస్, ప్రవీణ్, రాజు, నరేష్, ఐలయ్య, కృష్ణ ప్రభాకర్ అభికిరణ్, దేవేందర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ : కొండా సుష్మిత పటేల్ (చిట్టక్క) జన్మదినాన్ని పురస్కరించుకొని సికే ఎం కాలేజ్ కొండా యువసేన ప్రెసిడెంట్ కొండా వీరాభిమాని బత్తుల వినోద్ ఇనుగల బాబు ఆధ్వ ర్యంలో సి.కేంఎం కాలేజ్ ప్రాంగణంలో లికేక్ కటింగ్ పండ్ల పంపిణీ చేశారు. జన్ను అనిల్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు అనిత, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాగోతు మురళి, సిరిమల చెన్నమల్లు, కుసుమ మురళిప్రతాప్, నీలం మధు, కడారి లెనిన్, నారగోని మురళి, మొరుపట్ల సాయి, దాసరి రాజేష్, జేబిచారి మంద సన్నీ, గ్యారే అనిల్, ఎండీ యాకూబ్, ఎండీ పాషా, ఎండీ అఫ్జల్, బొట్ల నితిన్ గారు పాల్గొని కేక్ కట్ చేసి పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమలాకర్, జున్ను సాయి, జన్ను చందు, పోలేపాక శ్రీధర్ చంటి, పాల్గొన్నారు.

జీపీ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-పర్వతగిరి



మండలంలోని చింతనెక్కొండ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో చలివేంద్రాన్ని బుధవారం స్థానిక పంచాయతీ కార్యదర్శి మామిడి సరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వేసవికాలంలో బాటసారులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు ఓరుగంటి శ్రీనివాస్,నాయకులు చలపతిరావు, గ్రామపంచాయతీ సిబ్బంది స్థానికులు , తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 1 నుండి సన్న బియ్యం ప్రారంభం

మండలంలో 3వేల57 క్వింటాళ్ల బియ్యం పంపిణీ

నవతెలంగాణ-మహదేవపూర్

రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ ఒకటి నుండి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాటు చేసి 50 శాతం షాపులకు బియ్యాన్ని తరలించారు. ఉగాది రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి ప్రారంభించడంతో ఆ తర్వాత ఏప్రిల్ ఒకటి నుండి రాష్ట్రంలో అన్ని గ్రామాలలో సన్నబియాన్నే ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆ శాఖ మంత్రి ఉత్తమ రెడ్డి ప్రకటించారు. మహాదేవపూర్ మండలంలో 22 రేషన్ షాప్ ద్వారా 1807 క్వింటాళ్ల బియ్యంను 1057 కార్డుదారులకు ఇవ్వడం జరుగుతుందని తాసిల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ తెలిపారు. ఇందులో 9137 తెల్ల రేషన్ కార్డులు కార్డులు 924 అంత్యోదయ అన్న యోజన కార్డులు ఉన్నాయి. గిరిజన సహకార కార్పొరేషన్ ద్వారా 997 రేషన్ కార్డుల ద్వారా 1248 క్వింటాళ్ల40 కేజీల బియ్యం గిరిజన సహకార సంఘం 18 షాపుల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని .. దేవసింగ్ తెలిపారు.

సంతోషకరమైన విషయం : కాటమన రాజయ్య, రాపల్లి కోట



సన్న బియ్యం పంపిణీ సంతోషకరమైన విషయం. లబ్ధిదారులు దొడ్డు బియ్యం తినలేక బర్రెలకు ఆవులకు పెట్టడం జరుగు తుంది. కొందరు బియ్యం అమ్ముకోవడం జరు గుతుంది. తనకు అయిదుగురు పిల్లలని దొడ్డిబియ్యం తినలేక ప్రతినెల 50 కిలోల సన్న బియ్యం కొంటున్నాం. సన్న బియ్యం పంపిణీ చేయడం పట్ల ప్రభుత్వానికి కతజ్ఞతలు.

ఆర్థికభారం తగ్గుతుంది : పంచక సుజాత, మహిళ



సన్న బియ్యం పంపిణీ చేయడం పట్ల మాకు ఆర్థిక భారం తగ్గుతుంది. దొడ్డు బియ్యం వల్ల పిల్లలు తిన లేక బర్రెలకు ఆవులకు పెడుతున్న దుస్థితి నెల కొంది. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టు కున్నందుకు ధన్యవాదాలు.

ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు : మంచినీళ్ల దుర్గయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, అన్నారం మాజీ ఎంపీటీసీ

సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టనున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఎన్నికల ముందు అప్పటి ఎమ్మెల్యే ప్రస్తుతం మంత్రి శ్రీధర్ బాబు ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చుతున్నందుకు ప్రత్యేక కతజ్ఞతలు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబాబాద్
గురువారం | మార్చి 27, 2025 | www.navatelangana.com

పాస్టర్ ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలి

● ఎమ్మార్పీఎస్ డిమాండ్



నవతెలంగాణ-కొత్తగూడ

మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చింత అనిల్ మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మిడతపల్లి యాకయ్య మాదిగ పాల్గొని మాట్లాడారు. ఆంధ్ర ప్రదేశ్ రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ పగడాల ను హత్య చేసి కొట్టి పడేసి యాక్సిడెంట్‌గా చిత్రీకరించి కేసును తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. డెడ్ బాడీని పోస్టుమార్టం చేసి రిపోర్టులు న్యాయబద్ధంగా ఇవ్వకపోతే క్రైస్తవ సమాజం శాంతియుతం మానుకొని శాంతి భద్రతలకు ఆటంకం కలిగే అవకాశాలు ఉన్నాయన్నారు. కనుక మరణం వెనుక దోషులు ఎవరైతే ఉన్నారో వారికి చట్టపరమైన శిక్ష పడే విధంగా న్యాయ విచారణ జరిపి పాస్టర్ ప్రవీణ్ పగడాల కుటుంబానికి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తీగల ప్రేమ్ సాగర్ మాదిగ, జిల్లా ప్రచార కార్యదర్శి బాల్య శంకర్ మాదిగ, మండల అధికార ప్రతినిధి తాళ్ళపెల్లి ప్రభాకర్ మాదిగ, ప్రధాన కార్యదర్శి మిడతపల్లి విక్రమ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల కోశాధికారి గుడెల్లి రవి, ఎర్ర రామచంద్రు, మచ్చ రాజు తదితరులు పాల్గొన్నారు.



విధి నిర్వహణలో మచ్చలేని మనిషి అటెండర్ సంతోషమ్మ

-పదవీ విరమణ సభలో తహసీల్దార్ సైదులు

-ఘన సన్మానం..

నవతెలంగాణ-మరిపెడ

2022 నుండి తహసిల్దార్ కార్యాలయంలో అటెండర్ గా పనిచేసిన సంతోషమ్మ విధినిర్వహణలో మచ్చలేని మనిషిగా ఉన్నారని ఆమె పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా బాధగా ఉన్నా ఉద్యోగరీత్యా పదవీ విరమణ పొందక తప్పదని మరిపెడ తహసిల్దార్ డి.సైదులు అన్నారు. బుధవారం అటెండర్ బేతమల్ల సంతోషమ్మ పదవీ విరమణ ఫంక్షన్ తాహసిల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమెను శాలువతో ఘనంగా సత్కరించి సన్మానించి పూల బొకే అందించారు. ఈసందర్భంగా తహసిల్దార్ సైదులు మాట్లాడుతూ బయ్యారం గ్రామానికి చెందిన అమే తన భర్త చనిపోయిన తర్వాత తర్వాత ఉద్యోగంలో చేరిన సంతోషమ్మ వివిధ మండలాలలో సేవలందించారని తెలిపారు. ఆమె క్రమశిక్షణ, చైతన్యం పిల్లలని కాకుండా మాకార్యాలయంలో సిబ్బంది సైతం ఆమెను చూసి నేర్చుకున్నారన్నారు. సంతోషమ్మ జీవితం సంతోషంగా గడవాలని కోరుకుంటున్నానన్నారు. ఈకార్యక్రమంలో ఖమ్మం కార్పొరేటర్ క్లైమేట్, మరిపెడ డిప్యూటీ తహసిల్దార్ సుచిత్ర, ఆర్ఐ ఆర్ శరత్‌చంద్ర, రిటైర్డ్ ఉద్యోగులు మాణిక్యం, వివేకానంద, కార్యాలయం సిబ్బంది, కుటుంబ సభ్యులు, సంతోషమ్మను ఘనంగా సన్మానించారు.

బీపీ రోగులు ఆహార నియమావళి పాటించాలి

నవతెలంగాణ-మహబూబాబాద్



బీపీ రోగులు ఆహార నియమాలు పాటించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ ఎం.సందీప్ అన్నారు బుధవారం మహబూబాబాద్ ఇంద్రా నగర్ కాలనీలో ఉన్న వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనుమతితో ఎం.సందీప్, సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్‌లు హైబీపీ కేసులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా మందులు వాడుతున్నారా లేదా అని తెలుసుకొని ప్రతి నెలా పరీక్షలు చేయించుకుంటున్నారా , వ్యాధి తగ్గింది నిర్ధారించుకుంటున్నారా అని అని తెలుసుకున్నారు ఇందిరానగర్ సబ్ సెంటర్ కృష్ణ కాలనీ సబ్ సెంటర్ నందు ఒక 40 కేసులను పరీక్షించి సరైన సమయంలో మందులు ఇస్తున్నారా మీరు వాడుతున్నారా అని అడిగి తెలుసుకుని తగు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో డాక్టర్ నర్మద ఎఎన్ఎంలు, దీనదైవతి, లలిత, ఆశ కార్యకర్తలు మాధవీ, మహేశ్వరి, మమత, విజయ, మంగ విజయ, సరిత యశోద తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి సదస్సులో ప్రతిభచాటిన మాటేటి శ్రీతేజ్



అమెరికాలో అవార్డు గెలుచుకున్న తెలుగు తేజం...

దేశవ్యాప్తంగా అభినందనలు..

నవతెలంగాణ-మహబూబాబాద్

తెలంగాణ రాష్ట్రానికి చెందిన మాటేటి శ్రీతేజ్ అమెరికా దేశంలో జరిగిన మిస్సిస్సిప్పీ 89వ వార్షిక సమావేశంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొని ఉత్తమ ఓరల్ ప్రెజెంటేషన్ విభాగంలో అవార్డును, నగదు బహుమతిని సాదించి మన రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచం నలుమూలల చాటిచెప్పాడు. సోలనేషియస్ క్రాప్స్ ఇన్స్‌పెక్టింగ్ ఫైటో ఫ్లాస్మాస్, సీడ్ ట్రాన్స్ మిషన్ ఎపిడెమియోలాజికల్ ఇన్ సైట్స్ అనే అంశాన్ని ప్రదర్శించి, ప్రసంగించారు. అమెరికాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొనడమే అరుదైన అవకాశం కాగా అలాంటి విశ్వవేదికపై మన తెలంగాణతేజం తళుక్కున మెరవడం, అవార్డును సహితం సొంతం చేసుకోవడంతో వివిధ రంగాల ప్రముఖుల నుండి, అనేక వర్గాల ప్రజల నుండి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

మాటేటి వారి మూలాలు

మహబూబాబాద్ జిల్లాలోనే..

మొదటి నుంచి చదువుకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చే మాటేటి వారి కుటుంబం మూలాలు మహబూబాబాద్ జిల్లాలోని చిన్నగూడూర్ మండలకేంద్రంలోనే ఉన్నాయి. చిన్నగూడూరుకు చెందిన పద్మశాలి కులానికి చెందిన వీరి కుటుంబం నేత వృత్తి కోసం, ఉపాధిని వెతుక్కుంటూ సిర్పూర్ కాగజ్ నగర్ వెళ్లి అక్కడే స్థిరపడ్డారు.

శ్రీతేజ్ విద్యాభ్యాసం సాగిందిలా..

శ్రీతేజ్ తండ్రి మాటేటి ఏకాంబ్రం ఉద్యోగరీత్యా పలుప్రాంతాల్లో పనిచేయాల్సి రావడంతో ఆయన విద్యాభ్యాసం కూడా పలుప్రాంతాల్లో సాగింది. ప్రాధమిక విద్యాభ్యాసం కుమరంబీం జిల్లాలోని ఆసిఫాబాద్ లో, ఆతర్వాత 5, 6 తరగతులు ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ నందు శ్రీ సరస్వతి విద్యాలయంనందు 7, 8 తరగతులు ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వరంగల్ లో చదివారు. తొమ్మిది, పదవ తరగతులు ఎస్ఆర్ పాఠశాలలో చదివారు. ఇంటర్మీడియట్ శ్రీచైతన్య బాచుపల్లిలో, డిగ్రీ అగ్రికల్చర్ బిఎస్సీ పంజాబ్ లోని లౌల్లి ప్రొపేషనల్ యూనివర్సిటీలో పూర్తి చేసాడు. సంవత్సరంపాటు హైదరాబాద్ లో ఉద్యోగం చేసాడు. ఆతర్వాత ఇటలీలోని యూనివర్సిటీ ఆఫ్ బొలగ్నలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేసాడు. అదే యూనివర్సిటీలో రెండు సంవత్సరాలపాటు ఉద్యోగం చేసాడు. అమెరికాలోని మిస్సిస్సిప్పీ యూనివర్సిటీ రూ.60లక్షల ఫెలోషిప్ మంజూరు చేసి రిసెర్చ్ కోసం ఆహ్వానించారు. గతంలోనూ ఇటలీ లోని బొలగ్న యూనివాసిటీ వారు దోహ దేశ రాజధాని కతార్ లో జరిగిన అంతర్జాతీయ సదస్సులోనూ శ్రీతేజ్ పాల్గొని ప్రసంగించిన వారిలో శ్రీతేజ్ అతి పిన్న వయస్కుడు .ఇంత చిన్నవయస్సులోనే వివిధ సందర్భాలు, సమావేశాల కోసం శ్రీతేజ్ 14దేశాలలో పర్యటించారు..

అందాల పోటీలను రద్దు చేయాలి: పీవోడబ్ల్యూ డిమాండ్







నవతెలంగాణ-మహబూబాబాద్

హైదరాబాద్‌లో జరిగే 72 వ ప్రపంచ అందాల పోటీలను రద్దు చేయాలని, రేవంత్ రెడ్డి మహిళలకు ఇచ్చిన హామీ ప్రకారం గృహ లక్ష్మీ పథకం కింద నెలకు రూ.2500 చెల్లించాలని, మహిళ్లపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు హత్యలను అరికట్టాలని తదితర డిమాండ్లతో ప్రగతిశీల మహిళా సంఘం పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో బుధవారం మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు కల్పన, మునీత, జ్యోతి, పద్మ, స్వప్న, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం:

ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసిల్దార్‌కు మోమోరాండం అందజేశారు. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కార్యదర్శి ఊకే పద్మ మాట్లాడుతూ మన దేశంలో ప్రపంచ అందాల పోటీలు నిర్వహించడం ఇది మూడోసారి, తెలంగాణ సంస్కృతులను ప్రపంచ స్థాయికి తెలియజేయడానికి అందాల పోటీలు తెలంగాణ హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య సలహాదారులు స్మిత సబర్వాల్ మాట్లాడడం సిగ్గుచేటని వారన్నారు. కోట్లు ఖర్చుపెట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం తప్ప ప్రజా సమస్యల పరిష్కారం కావన్నారు. తక్షణమే అందాల పోటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుడుం అనురాధ, బొల్లం సోమక్క, గోమతి, ధనమ్మ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గార్ల:

మే 7వ తేదీ నుండి హైదరాబాద్‌లో జరగనున్న ప్రపంచ సుందరి పోటీలను తక్షణమే రద్దు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి ఊకే పద్మ డిమాండ్ చేశారు. రాష్ట్ర రాజధాని కేంద్రంలో జరిగే ప్రపంచ అందాల పోటీలను రద్దు చేయాలని కోరుతూ బుధవారం పీవోడబ్ల్యూ అధ్వర్యంలో స్దానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అందోళన చేపట్టారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందాల పోటీల వల్ల మహిళలకు ఎలాంటి ప్రయోజనం లేదని, సామ్రాజ్యవాదులు, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమేనన్నారు. అందాల పోటీలను ఆపకుంటే మహిళా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు అనురాధ, జడ ఐలమ్మ, జి.లక్ష్మి సోమక్క, గోళ్ళ సుజాత, సైదమ్మ పిచ్చమ్మ మౌనిక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్దుడు మృతి

నవతెలంగాణ-పెద్దవంగర:



గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బావోజీ తండాకు చెందిన బానోత్ పంతులు నాయక్ (70) మేకలు మేపుతూ భార్య బాజు తో కలిసి జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం చిన్నవంగర ఎక్స్ రోడ్డు సమీపంలోని కిరాణా షాపుకు వెళ్ళి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు కావడంతో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పంతులునాయక్ మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.